గురువారం
24-11-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 152
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

ఐక్యతాస్త్రంతోనే...

ప్రజలు ఏకమైతే ఎటువంటి అన్యాయాన్నైనా అడ్డుకోగలరని గ్రీస్ పౌరులు రుజువు చేశారు. రాజధాని ఏథెన్స్‌లో అరకొర పెంఛన్‌పై బతికే ఓ వృద్ధురాలు బ్యాంకుకు బకాయి పడి ఇంటిని కోల్పోయే పరిస్థితుల్లో ఆమెకు అండగా నిలిచారు.

2లో

కాల్పుల కలకలం

- వర్జీనియా వాల్‌మార్ట్‌లో 14 మంది కాల్చివేత
- దుండగుడి ఆత్మహత్య
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం

2లో

అందరూ ఎస్ బాస్‌లే!

- సీఈసీగా సమర్థులు అవసరం
- టీఎన్ శేషన్ వంటి బలమైన అధికారి ఉండాలి
- 8 ఏళ్లలో ఎనిమిది మంది మారారు
- కమిషనర్ల నియామకానికి కొలీజియం తరహా వ్యవస్థ ఏది?
- సుప్రీం కోర్టు ధర్మాసనం

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్ల సున్నితమైన భుజాలపై రాజ్యాంగం చాలా బాధ్యతను ఉంచిందని సుప్రీం కోర్టు పేర్కొంది. ప్రస్తుత వ్యవస్థలో కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా... తమకు అనుగుణంగా వ్యవహరించే వ్యక్తినే సీఈసీగా నియమిస్తుందని అసహనం వ్యక్తం చేసింది. ఎన్నికల అధికారిని రాజకీయ పార్టీల ప్రభావం నుంచి దూరంగా ఉంచాలని, అప్పుడే స్వతంత్రంగా వ్యవహరించగలరని వ్యాఖ్యానించింది. కేంద్ర ఎన్నికల సంఘం స్వతంత్రంగా పని చేయాలంటే, ప్రధాన ఎన్నికల అధికారి నియామకం కోసం ఏర్పాటు చేసే కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తిని చేర్చాలని సర్వోన్నత న్యాయస్థానం

- మిగతా 2 లో

ప్రధానిపై సీఈసీ చర్యలు తీసుకోగలరా?

న్యూఢిల్లీ: భారత ఎన్నికల సంఘం నియామక ప్రక్రియ పై కొన్ని పదునైన వ్యాఖ్యలు, ప్రశ్నలతో పాటు సుప్రీం కోర్టు ఇప్పుడు నిర్దిష్ట నియామక ఫైళ్లను కోరింది. ఎన్నికల సంఘం స్వతంత్రంగా పని చేయాలంటే... కింది స్థాయి నుంచే పారదర్శక నియామక ప్రక్రియ ఉండాలని సూచించింది. 'ఇప్పుడున్న రోజుల్లో కేంద్రంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా... ఆ

- మిగతా 2 లో

5న జగనన్న ఇళ్లపై

ఆందోళనలు

- లబ్ధిదారుల సంతకాలతో వినతిపత్రాలు అందజేస్తాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: ముఖ్యమంత్రి జగన్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీలకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిసెంబరు 5వ తేదీన జగనన్న ఇళ్లపై ఆందోళనలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. జగనన్న కాలనీల ఇళ్లు, టిడ్కో లబ్ధిదారులతో సంతకాలు చేయించి మండల కేంద్రాలలో అధికారులకు వినతి పత్రాలు అందచేస్తామన్నారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మార్కండేయపురం సమీపంలోని వెంకట దేవీపురంలో నిర్మిస్తున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలను సీపీఐ ప్రతినిధి బృందం బుధవారం పరిశీలించింది. ఇళ్ల నిర్మాణాలలో ఎదురవుతున్న

- మిగతా 2 లో

జంగారెడ్డిగూడెంలో జగనన్న ఇళ్లను పరిశీలిస్తున్న రామకృష్ణ, అక్కినేని వనజ, దేగా ప్రభాకర్, బండి వెంకటేశ్వరరావు, చైతన్య తదితరులు

భూ తగాదాలకు

శాశ్వత పరిష్కారం

- 2023 చివరినాటికి రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర సర్వే
- ఇక గ్రామ సచివాలయాల్లో క్రయ విక్రయాలు
- చంద్రబాబు మాటల్ని నమ్మొద్దు
- నరసన్నపేట సభలో సీఎం వైఎస్ జగన్

3లో

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి

లైన్‌క్లియర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి ఏపీ హైకోర్టు అంగీకరించింది. పాత పద్ధతి ప్రకారం ఎంపికైన అభ్యర్థుల జాబితాకు లైన్‌క్లియర్ చేసింది. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ల పోస్టుల ఎంపికలో అన్యాయం జరిగిందన్న మరికొందరి పిటిషన్లను కొట్టివేసింది. పాత పద్ధతిని కొనసాగించాలని న్యాయమూర్తి గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ ఆదేశాలిచ్చారు. తాము ఎంపికైనాగానీ నియామకాలు నిలిపివేశారని మెరిట్ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా వీరి తరఫున న్యాయవాది నర్రా శ్రీనివాస్ వాదనలు వినిపించారు. కాగా, పాత నోటిఫికేషన్ ప్రకారమే అభ్యర్థులను ఎంపిక చేస్తామని హైకోర్టుకు ప్రభుత్వ న్యాయవాది తెలిపారు.

మా ప్రచారం

విద్వేషానికి వ్యతిరేకం

- హింస-భయం అంతమే లక్ష్యం
రాహుల్ గాంధీ ఉద్ఘాటన

2లో

అందరం కలుద్దాం

బీజేపీ, వైసీపీని ఓడిద్దాం

- టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ ఐక్యత అవశ్యం
- గవర్నర్ వ్యవస్థపై జాతీయస్థాయి పోరాటం
- డాక్టర్ నారాయణ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాల అప్రజాస్వామిక విధానాలను, అరాచకాలను అరికట్టేందుకుగాను టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల ఐక్యత అవశ్యమని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. ఇష్టమున్నా... లేకున్నా కలిసికట్టుగా బీజేపీ, వైసీపీని గద్దె దించితేనే ప్రజాస్వామ్యానికి మనుగడ సాధ్యమన్నారు. విజయవాడ దాసరిభవన్‌లో మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్‌తో కలిసి నారాయణ విలేకరుల సమావేశంలో బుధవారం మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక చర్యలను నారాయణ దుయ్యబట్టారు. జీ20 కూటమి సమావేశాలకు సంబంధించి బీజేపీ ఎన్నికల గుర్తును పోలిన లోగో ఆవిష్కరించడం దుర్మార్గమన్నారు. వెంటనే జీ20 లోగో మార్చాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో మహిళా బిల్లు ఇరవై ఏళ్లుగా పెండింగ్‌లో ఉందని, బీజేపీకి పూర్తి మెజార్టీ ఉన్నందున ఆ బిల్లు ఆమోదిస్తే జీ20కి నాయకత్వం వహిస్తున్న మోదీకి గౌరవం దక్కుతుందన్నారు. చిత్తశుద్ధి ఉంటే జీ20 సమావేశాలకు ముందే మహిళా బిల్లును ఆమోదించాలన్నారు. ఇతర పార్టీ నేతలపై ఒత్తిడి తెచ్చేలా సీబీఐ, ఈడీని మోదీ ప్రభుత్వం ప్రయోగిస్తోందని, ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి డబ్బు, పదవులను ఎర చూపుతోందని మండిపడ్డారు. తెలంగాణలో టీఆర్ఎస్ నాయకులపై దాడులు రాజకీయ కోణంలో చేసినవేనని, అక్కడ కేంద్ర, రాష్ట్ర

- మిగతా 2 లో

నేడు రిషికొండకు నారాయణ

విశాలాంధ్ర బ్యూరో- విజయవాడ: సీపీఐ జాతీయ కార్యదర్శి డా॥ కె.నారాయణ గురువారం పర్యాటక కేంద్రమైన రుషికొండను సందర్శించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు అనుమతిచ్చింది. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం అనుమతి మేరకు రిషికొండను సందర్శించాల్సిందిగా నారాయణకు ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.కన్నబాబు విజ్ఞప్తి చేశారు.

20 మంది

ఏఎస్పీలకు పదోన్నతి

- విజయవాడ డీసీపీగా మోకా సత్తిబాబు
- విశాఖ డీసీపీగా ఆనంద్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 20 మంది అదనపు పోలీస్ సూపరింటెండెంట్‌లకు (ఏఎస్పీ) నాన్ కేడర్ ఎస్పీలుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు వారికి పోస్టింగ్‌లు ఇస్తూ హోంశాఖ ముఖ్యకార్యదర్శి హరీశ్‌కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారిలో విజయవాడ డీసీపీగా మోకా సత్తిబాబు, విశాఖపట్నం డీసీపీగా ఆనంద్ రెడ్డి, కేఎం మహేశ్వర రాజును ఎస్ఈబీ మంగళగిరికి నియమించారు. ఇంకా పదోన్నతి పొందిన వారిలో బి.లక్ష్మీనారాయణ, ఏ.సురేశ్‌బాబు, కె.శ్రీనివాసరావు, ఎస్.శ్రీధర్, కె. తిరుమలేశ్వర రెడ్డి, ఎస్వీ మాధవరెడ్డి, జె.రామమోహన్‌రావు, ఎన్.శ్రీదేవి రావు, ఇ.అశోక్ కుమార్, ఎ.రమాదేవి, కేజీవీ సరిత, కె.చక్రవర్తి, కె. ఈశ్వరరావు, కె.చౌడేశ్వరి, ఇ.సుప్రజ, కేవీ శ్రీనివాసరావు, కె.లావణ్య లక్ష్మి, ఎం.సుందరరావు ఉన్నారు.

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా

రుద్రరాజు

2లో

ఇదీ లోకం!

ప్లీజ్,ప్లీజ్ మీరు వేసుకున్నది కూడా నాకు ఇచ్చేయండి!

చెలరేగిపోతున్న

మట్టి మాఫియా!

- నిబంధనలకు పాతర
- అర్ధరాత్రి వేళ అడ్డగోలు తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- మామూళ్ల మత్తులో రెవెన్యూ సిబ్బంది
- ఖద్దరు మాటున దళారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

విశాలాంధ్ర- జీలుగుమిల్లి: ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలంలో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. నిబంధనలకు పాతరేసి రాత్రికిరాత్రే మట్టిని అక్రమంగా తరలించేస్తున్నారు. దళారులతో కలిసి మట్టి అక్రమ తవ్వకాలు చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. ప్రతి రోజూ రాత్రిపగలు అన్న తేడా లేకుండా మట్టి తవ్వేస్తున్నారు. పరిమితికి మించి ట్రాక్టర్లలో లోడ్ చేస్తూ దోచేస్తున్నారు. పేదోడు అన్ని ధృవపత్రాలతో దరఖాస్తు చేసుకున్నా, నిబంధనలు ఒప్పుకోవు అంటూ మట్టి తోలకానికి అనుమతివ్వని అధికారులు, అదే షెడ్యూల్ ఏరియాలో మాత్రం ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నా అటువైపు చూడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకటిపడితే చాలు మితిమీరిన వేగంతో వీధులపై తిరుగుతుండడం భయాందోళన కలిగిస్తోందని ఆందోళన చెందుతున్నారు. దళారులతోకలిసి పెద్ద మనుషులుగా చెలామణీ అయ్యే కొందరు అడ్డగోలుగా లక్షల్లో విలువచేసే మట్టిని దోచుకుంటున్నా అడ్డుకునే సాహసం చేయకపోవడం విడ్డూరంగా ఉందంటున్నారు.

సూర్యాస్తమ సమయానికే మట్టి తవ్వకాలు నిలిపివేయాలని నిబంధనలు చెబుతుంటే, ఎటువంటి అనుమతులు లేకుండా అర్ధరాత్రి సమయంలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి ట్రాక్టర్లపై తరలించుకుపోతుంటే అడ్డుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామంలో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరిగినా వెంటనే స్పందించి ఉన్నతాధికారులకు తెలియజేయాల్సిన సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ ఉద్యోగులు

- మిగతా 2 లో

ఐక్యతాస్త్రంతోనే...

- గ్రీస్‌లో వృద్ధ మహిళకు అండగా నిలిచిన ప్రజలు, కామ్రేడ్లు
- కలిసికట్టుగా ఇంటి స్వాధీనాన్ని అడ్డుకొన్న స్థానికులు
- పీఏఎంఈ సమ్మెకు వెల్లువెత్తిన సంఘీభావం
- ప్రభుత్వానికి, బ్యాంకుల తీరుకు నిరసనగా భారీ ప్రదర్శన
- రోడ్డుపైకొచ్చిన వందలాది మంది

ఎథేన్స్: ప్రజలు ఏకమైతే ఎటువంటి అన్యాయాన్నైనా అడ్డుకోగలరని గ్రీస్ పౌరులు రుజువు చేశారు. రాజధాని ఏథేన్స్‌లో అరకొర పింఛన్‌పై బతికే ఓ వృద్ధురాలు బ్యాంకుకు బకాయి పడి ఇంటిని కోల్పోయే పరిస్థితుల్లో ఆమెకు అండగా నిలిచారు. ఇంటి వేలాన్ని అడ్డుకున్నారు. పీఏఎంఈ కామ్రేడ్లు కలిసిరావడంతో పోలీసులు వెనక్కితగ్గక తప్పలేదు. వృద్ధురాలికి ఒక దివ్యాంగ కుమారుడు ఉన్నాడు. భర్తను కోల్పోయిన ఆమె 15.000 యూరోల రుణాన్ని కట్టలేక సెటిల్మెంట్‌ను కోరారు. అయితే ఈ ప్రక్రియలో జాప్యం వల్ల వడ్డీ పెరిగి అప్పు రెట్టింపు అయింది. ఆ మొత్తాన్ని చెల్లించే పరిస్థితిలో వృద్ధురాలు లేనందున ఆమె ఇంటిని స్వాధీనం చేసుకొని వేలం వేసేందుకు బ్యాంకు ప్రయత్నించింది. ఇందుకోసం సోమవారం ఉదయం 5.30 గంటలకు పోలీసుల దళాలు ఆమె ఇంటి తలుపు బద్దలుగొట్టి లోపలికి వెళ్లి ఆమెను కోటు కూడా ధరించే సమయం ఇవ్వకుండా బయటకు వెళ్లకొట్టారు. వెంటనే చుట్టుపక్కల వారితో పాటు గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ అనుబంధ ఆల్ వర్కర్స్ మిలిటెంట్ ఫ్రంట్ (పీఏఎంఈ) కేడర్ వారిని అడ్డుకున్నారు. వృద్ధురాలి ఇల్లు, సామాన్ల జప్తును నిలువరించి ఆమెను మరలా ఇంట్లోకి తీసుకెళ్లారు. అదే అపార్ట్‌మెంట్ వద్ద నిరసనకు పీఏఎంఈ పిలుపునివ్వగా వందలాది మంది రోడ్లపైకి వచ్చి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం-బ్యాంకుల ప్రజా వ్యతిరేక ధోరణిని ఎండగడుతూ భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. పేదల ఇళ్ల దోపిడీని అడ్డుకుంటా మని తేల్చిచెప్పారు. ఏథేన్స్ నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ 'ప్రతిచోట మన స్పందన ఇదే విధంగా ఉండాలి. ప్రజల ఇళ్లపై చేయి వేసే పరిస్థితి రాకూడదు. మన ఇళ్లను మనమే కాపాడుకోగలం' అని పిలుపునిచ్చారు. తనకు అండగా నిలిచిన అందరికీ బాధిత వృద్ధురాలు కృతజ్ఞతలు తెలిపారు. 'ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. ఐకమత్యమే మన అస్త్రం! అదే మనకు బలం... ఎప్పటికీ మన ఆయుధం' అని ఆమె నొక్కిచెప్పారు. కాగా, సంబంధిత ఫండ్స్ కంపెనీ కార్యాలయాల వద్ద ఆందోళనకు పీఏఎంఈ పిలుపునివ్వగా అది డొల్ల కంపెనీ అని, దానికి ఎలాంటి కార్యాలయాలు లేవని వెల్లడైంది.

విశాలాంధ్ర ప్రపంచం

రక్షణ నెపంతో దాడులు గర్హనీయం

సిరియా, ఇరాక్‌పై ఎర్డోగన్ దాడులకు టర్కీ కమ్యూనిస్టుల ఖండన

అంకారా: దేశరక్షణ నెపంతో పక్క దేశాలపై దాడులు గర్హనీయమని టర్కీలోని ఏకేపీ ప్రభుత్వంపై టర్కీ కమ్యూనిస్టు పార్టీ (టీకేపీ) ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎర్డోగన్ సర్కార్ మరో మారు నిజాన్ని కప్పేస్తోందని విమర్శించింది. సిరియా, ఇరాక్‌లోని కుర్దిష్ ప్రాంతాలపై టర్కీ దళాల వైమానిక దాడులను తాజా ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. ఏకేపీ ప్రభుత్వ విధానాలు ఆక్షేపణీయమని పేర్కొంది. జిహాదీలకు దేశంలోకి ద్వారాలు తెరిచిందని దుయ్యబట్టింది. జిహాదీ గ్యాంగులు దేశంలోనే కాకుండా చుట్టుపక్కల దేశాల్లోని తమ ఆధీన ప్రాంతాల్లో సైన్యాన్ని సిద్ధం చేసుకుంటూ అంతర్గత వ్యవహారాల్లోనూ తలదూర్చుతున్నాయని, ఏకేపీ ప్రభుత్వ తప్పుడు చర్యలతోనే ఇలాంటి పరిస్థితి దాపురించిందని టర్కీ కమ్యూనిస్టు పార్టీ వ్యాఖ్యానించింది. టర్కీ భద్రతకు నిజమైన ముప్పు పొంచివున్నదని ఆందోళన వ్యక్తంచేసింది. టర్కీ సమస్యలను అంతర్గతంగానే పరిష్కరించుకోవాలి. పక్కదేశాల భూభాగాల్లో సైనిక చర్యలతో మన ప్రజలకు భద్రత కల్పించలేరు. ఏకేపీ ప్రభుత్వ విదేశీ విధానానికి ప్రత్యామ్నాయాన్ని సూచించే పరిస్థితి బూర్జువ ప్రతిపక్షానికి లేదు. దేశ రక్షణ సమస్యగా మారింది' అని ఆందోళన వ్యక్తంచేసింది. ఈ సమస్యకు పరిష్కారం మన సమాజంలోనే ఉన్నదని నొక్కిచెప్పింది. గుడ్డిగా హింసకు పాల్పడేవారు... చుట్టుపక్కల సరిహద్దుల పరిధిలో దాడులు జరిపేవారు, వీటన్నింటి ద్వారా లబ్ధి పొందేవారంతా ఎక్కడో కాదు ఇక్కడే ఉన్నారు.. వీరిని వేరిపారేసి సమాజాన్ని ప్రక్షళన చేస్తే తప్ప మన ప్రజలకు భద్రత, సుసంపన్నత, సమానత్వం, స్వేచ్ఛ లభించవని టర్కీ కమ్యూనిస్టు పార్టీ వెల్లడించింది. వీలైనంత త్వరగా ఈ సామాజిక రుగ్మతను పరిష్కరించాలని పిలుపునిచ్చింది.

నేపాలీ కాంగ్రెస్ ముందంజ

ఖాట్మండు: నేపాల్‌లో పార్లమెంటు, ఏడు అసెంబ్లీలకు ఆదివారం జరిగిన ఎన్నికల ఫలితాలు దశలవారీగా వెల్లడవుతున్నాయి. దేశంలో నేపాలీ కాంగ్రెస్ ఆధిక్యత కొనసాగుతున్నది. ఇప్పటికే 11 స్థానాలను గెలుచుకున్న నేపాలీ కాంగ్రెస్ మరో 46 నియోజకవర్గాల్లో ఆధిపత్యంలో కొనసాగుతోంది. సీపీఎన్- యూఎంఎల్ పార్టీ 42 నియోజకవర్గాల్లో ముందంజలో ఉండగా మూడు స్థానాలను గెలుచుకున్నది. కొత్తగా ఏర్పాటైన రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్‌ఎస్‌పీ) ఖాట్మండు జిల్లాలోని మూడు స్థానాలను కైవసం చేసుకుంది.

షేర్ బహదూర్ డ్యూబా ఘనవిజయం

ప్రధాని షేర్ బహదూర్ డ్యూబా తన నియోజకవర్గమైన దాడెధురా నుంచి వరుసగా ఏడవసారి ఘనవిజయం సాధించారు. డ్యూబాకు 25,534 ఓట్లు పోలవ్వగా ప్రత్యర్థి, స్వతంత్ర అభ్యర్థి సాగర్ ధకల్ (31)కు 1,302 ఓట్లు వచ్చాయి. డ్యూబా (77) తన ఐదు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఓటమి ఎరుగని నాయకుడిగా నిలిచారు. దేశ ప్రధానిగా ఐదవసారి నియమితులైన విషయం విదితమే.

ఇరాన్ నిరసనల్లో 300 మందికిపైగా మృతి

వారంలో 40 మంది హతం: ఐరాస మానవహక్కుల హై కమిషన్

జెనీవా: ఇరాన్ సాయుధ దళాలు రక్తం చిందించేందుకు ఏ మాత్రం వెనుకాడటం లేదని ఐక్యరాజ్య సమితి మానవహక్కుల హై కమిషనర్ (ఓహెచ్‌సీహెచ్‌ఆర్) ఆందోళన వ్యక్తంచేసింది. దేశంలో రెండు నెలలుగా సాగుతున్న నిరసనల క్రమంలో ఇప్పటివరకు 40 మంది చిన్నారులు సహా 300 మందికిపైగా బలయ్యారని తెలిపింది. పర్యవసానంగా ఇరాన్‌లో అత్యంత క్లిష్టపరిస్థితులు నెలకొని ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. పాలకులు, సాయుధ దళాల కఠినవైఖరి ప్రజల ప్రాణాలను హరిస్తోందని, వారంలో 40 మంది మృత్యువాత పడ్డారని ఐరాస మానవహక్కుల అధ్యక్షులు వోల్కర్ టర్క్ వెల్లడించారు. 31కుగాను 25 ప్రావిన్స్‌లలో మరణాలనే నివేదించినట్లు తెలిపారు. కుర్దిష్ నగరాల్లోనే దారుణ పరిస్థితులు ఉన్నాయన్నారు. 22ఏళ్ల మహ్‌సా అమినీ హత్యతో దేశంలో నిరసనలు మిన్నంటాయి. అయితే విదేశీ శత్రువుల ప్రోత్సాహం ఈ నిరసనలకు ఉన్నట్లు టెహ్రాన్ ఆరోపించింది.

చెలరేగిపోతున్న మట్టి మాఫియా!

(మొదటిపేజీ తరువాయి)

మామూళ్ల మత్తులో జోగుతున్నారని ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఎవరైనా మట్టి దందాపై ప్రశ్నిస్తే వారిపై దళారులు భౌతిక దాడులకు పాల్పడుతూ, భయభ్రాంతులకు గురిచేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ట్రాక్టర్ ఒక్కింటికి రూ.700 నుంచి రూ.800లకు అమ్మి సొమ్ముచేసుకుంటూ సామాన్యులను దోచుకుంటుంటే అడ్డుకునేవారే లేకుండా పోయారని ప్రజలు ఆవేదన వెళ్లగక్కారు. నిరుపేద గిరిజన, గిరిజనేతరులు కూలిపనులతో కూడబెట్టుకున్న సొమ్ముతో తలదాచుకునేం దుకు చిన్న ఇంటిని కట్టుకుందామంటే మట్టి తోలుకునేందుకు అధికారులు అనుమతి ఇవ్వడంలేదని గగ్గోలు పెడుతున్నారు. జేసీబీలు, భారీ యంత్రాలతో ప్రతిరోజూ మట్టితవ్వకాలు జరుపుతూ కోట్లాది రూపాయలు కొల్లగుడుతున్నారని మండిపడుతున్నారు. ఇంత జరుగుతున్నా నిత్యం అటుగా ప్రయాణించే అధికారుల కంటపడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని అంటున్నారు. అంతే కాకుండా, అసలు ఇసుక ర్యాంపులే లేకపోయినా అటవీ శాఖ పరిధిలో ఇసుకను సైతం రాత్రివేళల్లో తరలించుకుపోతున్నారని ఆరోపిస్తున్నారు. వాల్టా నిబంధనలను ఉల్లంఘించి తవ్వకాలు చేపడుతుండడంతో కాలువలు, వాగులు కోతకు గురై పంట భూములు, గ్రామాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని, అధికారులు తక్షణమే స్పందించి మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలు జరిపి లక్షల్లో సొమ్ము చేసుకుంటున్న దళారులు, వారికి సహకరిస్తున్న ఖద్దరు బాబులపై కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అందరం కలుద్దాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వాలు ఢీ కొంటున్నాయని వ్యాఖ్యానించారు. ఈ దాడుల పరంపరతో అధికారులు ఒత్తిడి భరించలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వాల అప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యతిరేక విధానాలపై సుప్రీంకోర్టు సుమోటోగా కేసు నమోదు చేయాలని, ఉన్నతస్థాయి విచారణ వేసి వాస్తవాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే ఈ అరాచకాలు మరింత పెరిగిపోతాయని తెలిపారు. గవర్నర్ల వ్యవస్థను సైతం బీజేపీ స్వార్థం కోసం వాడుతున్నదని విమర్శించారు. తమిళనాడు, తెలంగాణ, కేరళ, పశ్చిమ బెంగాల్ పరిణామాలు చూశామని, అందువల్ల గవర్నర్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబరు మొదటి వారంలో జరగనున్న సీపీఐ జాతీయ సమావేశంలో దీనిపై చర్చించి, గవర్నర్ల రద్దు కోసం జాతీయస్థాయి పోరాటానికి శ్రీకారం చుడతామన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టులోనూ భిన్న తీర్పులు రావడం వింతగా ఉందని, దీనిపై పూర్తి ధర్మాసనం స్పష్టమైన తీర్పు ఇవ్వాలన్నారు. ఈడబ్ల్యూఎస్ విధానంపైనా తమ పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో చర్చిస్తామన్నారు. బీజేపీయేతర పార్టీలన్నింటినీ ఏకతాటిపైకి తెచ్చే అంశంపైనా సీపీఐ దృష్టి సారించిందన్నారు. వైసీపీ శ్రేణుల కనుసన్నల్లో ఇసుక, గనుల దోపిడీ యధేచ్ఛగా సాగుతోందని ధ్వజమెత్తారు. జగన్ పాలనలో అవినీతి రాజ్యమేలుతోందని మండిపడ్డారు. కోట్లాది రూపాయల ప్రజాధనం దోపిడీ జరుగుతోందన్నారు. ఏపీలో బీజేపీ, వైసీపీ కలిసి పనిచేస్తున్నాయని, అందుకే బీజేపీని విమర్శించే సాహసం జగన్ చేయడం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వబోమని పవన్ కల్యాణ్ గతంలో చెప్పి...మోదీతో భేటీ అయ్యాక ఆయన మౌనం దాల్చారన్నారు. బీజేపీ రాజకీయ వ్యూహం ఇలాగే ఉంటుందని, టీడీపీని బలహీన పరిస్తేనే బీజేపీ బలం పెరుగుతుందని కేంద్రం భావిస్తోందని మండిపడ్డారు. నాడు జగన్ ఒక్క ఛాన్స్ అన్నారని, ఇప్పుడు పవన్ కూడా ఒక్క అవకాశమని, చంద్రబాబు సైతం చివరి ఛాన్స్ అంటున్నారని ఎద్దేవా చేశారు. మోదీ, జగన్‌తో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. టీడీపీ, జనసేన కేవలం వైసీపీపైనే విమర్శలు చేస్తున్నాయని... బీజేపీని విమర్శించే సాహసం టీడీపీ చేయలేక పోతోందన్నారు. బీజేపీకి వైసీపీ, టీడీపీ, జనసేన సహకరిస్తున్నాయని దుయ్యబట్టారు. బీజేపీ, వైసీపీ అరాచకాలను అరికట్టాలంటే...అందరూ కలిసి రావాల్సిన అవసరముందని స్పష్టంచేశారు. ఈ కూటమికి టీడీపీ నాయకత్వం వహించాలని సూచించారు. ఈ ఐక్యతతో రాష్ట్రానికీ, ప్రజలకూ మేలు జరుగుతుందన్నారు. దేశంలో బీజేపీ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్నారు. తెలంగాణలో బీజేపీని టీఆర్ఎస్ బలంగా ఎదుర్కొంటుందని, ఆమ్ ఆద్మీ పార్టీ సైతం మోదీకి గట్టి పోటీ ఇస్తోందని వ్యాఖ్యానించారు. ఏపీలో మాత్రం మూడు ప్రధాన పార్టీలు బీజేపీని పల్లెత్తుమాట అనడం లేదని ఎద్దేవా చేశారు. రిషికొండ తవ్వకాలపై నారాయణ స్పందిస్తూ అది ప్రైవేటు ఆస్తి కాదనీ, ప్రభుత్వ ఆస్తి అని, అలాంటిది రిషికొండ సందర్శనపై ఎందుకు ఆంక్షలు విధిస్తున్నారని ప్రశ్నించారు. రిషికొండను దోచుకున్నారన్న నిజాలు బయటపడతాయని భయపడుతున్నారా అని నిలదీశారు. దీనిపై తాను హైకోర్టును ఆశ్రయించగా, సందర్శనకు అనుమతించిందని, అయితే తాను విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో రిషికొండ సందర్శనకు అనుమతిస్తూ పర్యాటక శాఖ ఉన్నతాధికారి కన్నబాబు తనకు లేఖ రాయడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారులు సైతం ప్రభుత్వానికి వత్తాసు పలకడం దుర్మార్గమన్నారు. బిగ్‌బాస్ షోపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కేసు తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. బిగ్‌బాస్ షో వల్ల యువత పెడత్రోవ పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బిగ్‌బాస్ షో రద్దయ్యేంత వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

మా ప్రచారం విద్వేషానికి వ్యతిరేకం

- హింస-భయం అంతమే లక్ష్యం రాహుల్ గాంధీ ఉద్ఘాటన
- మధ్యప్రదేశ్‌లోకి భారత్ జోడో యాత్ర ప్రవేశం
- నేడు పాల్గొననున్న ప్రియాంక

బోదర్లీ (మధ్యప్రదేశ్): ప్రస్తుతమున్నది అన్యాయాల భారతమని, ముగ్గురు-నలుగురు కార్పొరేట్ల చేతుల్లోకి ప్రజా సంపద వెళ్లిపోయిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. తమ ప్రచార యాత్ర విద్వేషానికి, హింసకు, సమాజంలో నెలకొన్న భయానికి వ్యతిరేకంగా సాగుతోందన్నారు. త్రివర్ణ పతాకాన్ని చేబూని కన్యాకుమారి నుంచి భారత్ జోడో యాత్రను ప్రారంభించామన్నారు. జాతీయ జెండా శ్రీనగర్‌కు చేరకుండా ఎవ్వరూ అడ్డుకోలేరని తేల్చిచెప్పారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం తదితర అంశాలపై కేంద్రప్రభుత్వంపై విమర్శలు చేశారు. దేశ యువత, రైతులు, కార్మికులను భయపెట్టి హింసను ప్రోత్సహిస్తోందన్నారు. భారత్ జోడో యాత్ర బుధవారం మధ్యప్రదేశ్‌లోని, బుర్హన్‌పూర్ జిల్లా, బోదర్లీ గ్రామంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రాహుల్ గాంధీ మాట్లాడారు. అక్కడున్న ఐదేళ్ల బాలుడు రుద్రను వేదికపైకి పిలిచి.. నీవు పెద్దయ్యాక ఏమవ్వాలని ఆశిస్తున్నావని అడిగారు. తనకు డాక్టర్ అవ్వాలని ఉందని రుద్ర బదులిచ్చాడు. దేశంలో విద్య ప్రైవేటీకరణ ధోరణి కొనసాగుతున్న క్రమంలో రుద్రా డాక్టర్ కావాలన్న ఆశ నెరవేరడం కష్టమేనని రాహుల్ అన్నారు. 'నేటిభారతంలో రుద్ర కలలు సాకారం కష్టసాధ్యం. ఎందుకంటే ప్రైవేటు వైద్య కళాశాలలో విద్య ఖరీదులో కూడుకున్నది. అతని తల్లిదండ్రులు కోట్లాది రూపాయలు వెచ్చించాల్సి ఉంటుంది. ఫీజు చెల్లించలేక ఇతను కార్మికుడిగా మారతాడు' అని రాహుల్ అన్నారు. పరిశ్రమలు, విమానాశ్రయలు, నౌకాశయాలన్నీ ముగ్గురు-నలుగురు పారిశ్రామికవేత్తల చేతుల్లోకి వెళ్లిపోయాయని, రైల్వే కూడా అంతేనన్నారు. 'ఇది అన్యాయాల భారతం.. మనకు ఇలాంటి భారతదేశం అక్కర్లేదని' ఉద్ఘాటించారు. అధిక ధరలకు పెట్రోల్, వంటగ్యాస్‌ను కొనుగోలు చేసే క్రమంలో సామాన్యుల జేబుకు చిల్లు పడుతుంటే, ఆ డబ్బుతో ముగ్గురు-నలుగురు పారిశ్రామికవేత్తలు జేబులు నింపుకుంటున్నారని రాహుల్ విమర్శించారు. కాగా, పాదయాత్ర మధ్యప్రదేశ్‌లోకి ప్రవేశించగా కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. రాష్ట్రంలో యాత్ర విజయవంతం అవుతుందని పార్టీ సీనియర్ నేత కమల్‌నాథ్ ఆకాంక్షించారు. ఈనెల 24-25 తేదీల్లో యాత్ర బుర్హాన్‌పూర్, ఇండోర్‌లో సాగే క్రమంలో ప్రియాంక గాంధీ కూడా ఇందులో పాల్గొంటారని చెప్పారు. వచ్చేఏడాది మధ్యప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న క్రమంలో పాదయాత్రకు భారీగానే ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సీనియర్ నేతలు దిగ్విజయ్ సింగ్, గోవింద్ సింగ్, సురేశ్ పచోరి, అరుణ్ యాదవ్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ మోడల్' అంటే
కులం... ఓటు బ్యాంకు రాజకీయాలే

ప్రధాని మోదీ

మెహసానా (గుజరాత్): 'కాంగ్రెస్ మోడల్ ' అంటే కులం, విభజన, ఓటు బ్యాంకు రాజకీయాలు గుజరాత్‌తో పాటు యావత్ దేశాన్ని నాశనం చేశాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. బుధవారం ఆయన ఎన్నికలు జరగనున్న గుజరాత్‌లోని మెహసానాలో బీజేపీ అభ్యర్థుల కోసం ప్రచారం చేశారు. మోదీ మాట్లాడుతూ 'ఈ మోడల్ గుజరాత్‌నే కాదు భారత దేశాన్ని కూడా నాశనం చేసింది. దేశాన్ని ముందుకు తీసుకెళ్లడానికి మనం ఈ రోజు తీవ్రంగా ప్రయత్నించడానికి ఇదే కారణం. మేము (బీజేపీ) అటువంటి పక్షపాతం, వివక్షత విధానాన్ని ఎన్నడూ ఆమోదించలేదు. అందుకే యువత మాపై వారికి ఉన్న నమ్మకాన్ని పునరుద్ధరిస్తున్నారు' అని అన్నారు. 'కాంగ్రెస్ మోడల్ అంటే అవినీతి, బంధుప్రీతి, వంశపారంపర్య రాజకీయాలు, మతతత్వం, కులతత్వం. వారు ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడి, వివిధ కులాల ప్రజల మధ్య లేదా వివిధ జిల్లాల్లో కూడా అధికారంలో ఉండటానికి చీలికలు సృష్టించడానికి ప్రసిద్ధి చెందారు' అని చెప్పారు. 'వారు (కాంగ్రెస్) ఎల్లప్పుడూ ప్రజలను పేదలుగా ఉంచాలని కోరుకుంటారు. అందువల్ల వారు ప్రభుత్వంపై ఆధారపడతారు' అని ఉత్తర గుజరాత్ పట్టణంలో జరిగిన ర్యాలీని ఉద్దేశించి ప్రధాని అన్నారు. బీజేపీ విధానాలు భవిష్యత్తులో తమకు మరిన్ని అవకాశాలు కల్పిస్తాయన్న విశ్వాసం యువతలో ఉందని తెలిపారు.

అందరూ ఎస్ బాస్‌లే!

(మొదటిపేజీ తరువాయి)

అభిప్రాయపడింది. బలమైన వ్యక్తిని ఆ పదవిలో నియమించడం చాలా ముఖ్యమని, ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా టీఎన్ శేషన్ వంటి అధికారి అవసరమని తాము కోరుకుంటున్నట్టుగా తెలిపింది. టీఎన్ శేషన్ కేంద్ర ప్రభుత్వ కేబినెట్ మాజీ కార్యదర్శి. 1990 డిసెంబరు 12న ఎన్నికల కమిషనర్(ఈసీ)గా నియమితులై...1996 డిసెంబర్ 11 వరకు పని చేశారు. ఆరేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసిన ఆయన... 2019 డిసెంబరు 10న మరణించారు. ఎన్నికల కమిషనర్ల నియామక వ్యవస్థలో సంస్కరణలు తేవాలని కోరుతూ దాఖలయిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కేఎం జోసెఫ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేపట్టింది. జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ సీటీ రవికుమార్ సభ్యులుగా ఉన్నారు. శేషన్ మినహా ఇప్పటి వరకు పనిచేసిన ఏ సీఈసీకి ఆరేళ్ల పదవీకాలం ఎందుకు రాదని ధర్మాసనం ప్రశ్నించింది. 2007 నుంచి సీఈసీలు చాలా తక్కువ సమయం పదవిలో ఉన్నారని తెలిపింది. అభ్యర్థుల పుట్టిన తేదీ ప్రభుత్వానికి తెలుసు. అయినప్పటికీ ఆరేళ్ల పూర్తి కాలాన్ని కొనసాగించని వ్యక్తులను ఎంపిక చేసుకుంటారు. తక్కువ పదవీకాలం సీఈసీల స్వతంత్రతను ప్రభావితం చేస్తుంది. ఈ ధోరణి కొనసాగుతూనే ఉంది. అది యూపీఏ ప్రభుత్వమైనా లేదా ఈ ప్రభుత్వమైనా' అని వ్యాఖ్యానించింది. 'ఉత్తమ వ్యక్తి సీఈసీగా ఎంపికయ్యేలా వ్యవస్థను ఏర్పాటు చేయడమే మా ప్రయత్నం' అని ధర్మాసనం పేర్కొంది. 'అనేక మంది ప్రధాన ఎన్నికల కమిషనర్లు ఉన్నారు. అయితే టీఎన్ శేషన్‌లా ఎప్పుడో ఒక్కరే గట్టిగా పనిచేశారు. 1990 నుంచి 1996 వరకు సీఈసీగా శేషన్ కీలక ఎన్నికల సంస్కరణలు తీసుకొచ్చారని, అలాంటి అధికారి ఆ పదవిలో ఉండాలని కోరుకుంటున్నాం. ముగ్గురు వ్యక్తుల (సీఈసీ, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు) సున్నితమైన భుజాలపై అపారమైన అధికారం ఉంది. సీఈసీ పదవికి ఆ ఉత్తమ వ్యక్తిని ఎలా వెతకాలి... ఏ విధంగా నియమించాలన్నదే ప్రశ్న' అని ధర్మాసనం పేర్కొంది. ప్రభావితం కాకుండా స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగల బలమైన, రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తిని నియమించడానికి న్యాయమైన, పారదర్శక పద్ధతిని అవలంబించాలని సూచించింది. కేంద్రం తరపున హాజరైన అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి... తాము చాలా మంచి విధానాన్ని రూపొందించామని... తద్వారా సమర్థతతో పాటు బలమైన వ్యక్తి సీఈసీగా నియమింపబడతారని తెలిపారు. 'ఉత్తమ వ్యక్తి నియామకాన్ని ప్రభుత్వం వ్యతిరేకించడం లేదు. అయితే ఎలా చేస్తారన్నదే ప్రశ్న. రాజ్యాంగంలో శూన్యత లేదు. ప్రస్తుతం ఎన్నికల కమిషనర్లను మంత్రి మండలి సహాయం, సలహా మేరకు రాష్ట్రపతి నియమిస్తారు' అని అటార్నీ జనరల్ చెప్పారు. ఎటువంటి చట్టాలు లేనప్పుడు వినీత్ నారాయణ్, విశాఖ తీర్పులు (పనిలో లైంగిక వేధింపులను ఎదుర్కోవటానికి మార్గదర్శకాలను నిర్దేశించాయి) జరిగాయని, ఈ విషయంలో అలాంటి శూన్యత లేదని చెబుతూ, ఈ కోణం నుంచి సమస్యను చూడాలని అన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ... 1990 నుంచి బీజేపీ కురువృద్ధుడు ఎల్‌కే అద్వానీ, అనేకమంది ఎన్నికల కమిషన్ సహా రాజ్యాంగ సంస్థల నియామకాలకు కొలీజియం లాంటి వ్యవస్థను కోరుతున్నాయని ధర్మాసనం పేర్కొంది. 'ప్రజాస్వామ్యం అనేది రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణం. దానిపై ఎలాంటి చర్చకు ఆస్కారం లేదు. మేము కూడా పార్లమెంటుకు ఏదో ఒకటి చేయమని చెప్పలేము. మేము అలా చేయము. 1990 నుంచి లేవనెత్తిన సమస్యకు మేము ఏదైనా చేయాలనుకుంటున్నాం' అని ధర్మాసనం తెలిపింది. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, అయితే ప్రస్తుత వ్యవస్థను దాటి వెళ్లనివ్వకుండా అధికార పార్టీ నుంచి వ్యతిరేకత వస్తుందని తమకు తెలుసని ధర్మాసనం పేర్కొంది. పదేళ్ల యూపీఏ హయాంలో ఆరుగురు సీఈసీలు ఉండగా, ఎన్‌డీఏ 8 ఏళ్ల పాలనలో ఎనిమిది మంది మారారని పేర్కొంది. రాజ్యాంగంలో నిర్దిష్ట ప్రక్రియ లేకపోవడంతో సీఈసీ, ఈసీల నియామక ప్రక్రియపై రాజ్యాంగ మౌనాన్ని ప్రభుత్వాలు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నాయని అభిప్రాయపడింది. న్యాయస్థానం నిస్సహాయమని, ఏమీ చేయలేమని చెప్పలేమని, ఇప్పుడున్న ఈసీలు, సీఈసీల నియామకానికి భిన్నమైన వ్యవస్థ ఉండాలని పేర్కొంది. సీఈసీలు, ఈసీల నియామకాలను నియంత్రించే ఒక చట్టం లేకపోవడం 'ఆందోళన కలిగించే ధోరణి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆర్టికల్ 324 సీఈసీ, ఈసీల ఎంపిక, నియామకం కోసం చట్టాన్ని రూపొందించాలని నిర్దేశిస్తుందని ధర్మాసనం ప్రస్తావించింది. రాజ్యాంగం అమలులోకి వచ్చి 72 ఏళ్లు అయినా ఇప్పటికీ చట్టం తీసుకురాలేదని అన్నారు. రాజ్యాంగం మౌనం ఈ విధంగా దోపిడీ చేయబడుతోందని కీలక వ్యాఖ్యలు చేసింది. ఇక, తదుపరి విచారణను ధర్మాసనం వాయిదా వేసింది. నవంబరు 17న కేంద్ర ప్రభుత్వం... సీఈసీలు, ఈసీల ఎంపికకు ఒక కొలీజియం వంటి వ్యవస్థను కోరుతూ దాఖలయిన వ్యాజ్యాలను తీవ్రంగా వ్యతిరేకించింది. అలాంటి ప్రయత్నమేదైనా, రాజ్యాంగాన్ని సవరించడం వంటిదేనని వాదించింది. కాగా 2018 అక్టోబరు 23న సీఈసీలు, ఈసీల ఎంపికకు కొలీజియం లాంటి వ్యవస్థను కోరుతూ దాఖలయిన వ్యాజ్యంను అధీకృత తీర్పు కోసం ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనానికి సుప్రీం కోర్టు సిఫార్సు చేసింది.

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రుద్రరాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజును అధిష్టానం బుధవారం రాత్రి ప్రకటించింది. 18 మందితో పొలిటికల్ అఫైర్స్ కమిటీని నియమించింది. వర్కింగ్ ప్రెసిడెంట్లుగా జంగా గౌతమ్, మస్తాన్ వలీ, పీ రాకేశ్‌రెడ్డి, సుంకర పద్మశ్రీ, ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్‌గా పల్లంరాజు, మీడియా కమిటీ చైర్మన్‌గా టి.తులసిరెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్‌గా మాజీ ఎంపీ హర్షకుమార్‌ను నియమించింది. వారితోపాటు 34 మందితో సమన్వయ కమిటీని అధిష్టానం ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా పనిచేసిన సాకే శైలజానాథ్ స్థానంలో గిడుగు రుద్రరాజును అధిష్టానం నియమించింది.

కాల్పుల కలకలం

వర్జీనియా: అమెరికా మరోసారి కాల్పులతో దద్దరిల్లింది. కొలరాడో ఘటన మరువక ముందే వర్జీనియాలో తుపాకీ పేలింది. చెసాపీక్‌లోని వాల్‌మార్ట్‌లో దాదాపు అరగంటకుపైగా మారణహోమం సాగింది. స్టోర్ మేనేజర్ విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడగా 14 మంది ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది గాయపడ్డారు. కాల్పులు జరిపిన వ్యక్తి తనను తాను కాల్చుకొని మరణించినట్లు పోలీసులు వెల్లడించారు. వాల్‌మార్ట్ వద్ద భారీగా అంబులెన్సులు, పోలీసులు చేరుకోవడం, మృతదేహాలు పడి ఉండటంతో అక్కడ భయానక దృశ్యం ఆవిష్కృతమైంది. మృతుల సంఖ్య పెరిగేందుకు అవకాశమున్నట్లు చెసాపీక్ పోలీసులు తెలిపారు. కాగా, స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 10.12గంటలప్పుడు ఈ ఘటన చోటుచేసుకుంది. దుండగుడు విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో వాల్‌మార్ట్‌లో ఉన్న జనం బిగ్గరగా కేకేలు వేస్తూ తమ ప్రాణాలు కాపాడుకునేందుకు బయటకు పరుగులు తీశారు. అనుమానితుడు 30-40 నిమిషాలు బీభత్సం సృష్టించాడని చెసాపీక్ పోలీస్ అధికార ప్రతినిధి లియో కొసినిస్కీ తెలిపారు. ఎంత మంది చనిపోయారో చెప్పలేముగానీ మృతుల సంఖ్య పెరగవచ్చు అన్నారు. పోలీసు సిబ్బందిపై కాల్పులు జరగలేదని తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరుగుతోందని, పూర్తి సమాచారం తెలియలేదని చెప్పారు. వాల్‌మార్ట్‌లోకి ఎవరినీ అనుమతిం చడం లేదన్నారు. తాజా ఘటన షాక్‌కు గురిచేసినట్లు వాల్‌మార్ట్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నామని సంస్థ వెల్లడించింది. కాల్పుల్లో గాయపడిన ఐదుగురు తమ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సెన్‌టారా నార్‌ఫోల్క్ జనరల్ హాస్పిటల్ అధికార ప్రతినిధి వెల్లడించారు.

సెనేటర్ దిగ్భ్రాంతి: వాల్‌మార్ట్‌లో కాల్పుల ఘటన కలచివేసిందని వర్జీనియా సెనేటర్ మార్క్ వార్నెర్ ట్విట్టర్‌లో వెల్లడించారు. పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోవడం దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. తాజా పరిణామాలను నిశితంగా గమనిస్తున్నట్లు ట్వీట్ చేశారు.

5న జగనన్న ఇళ్లపై ఆందోళనలు

(మొదటిపేజీ తరువాయి)

సమస్యలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించలేదని విమర్శించారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.లక్షా 80 వేలు సరిపోవన్నారు. పూర్తిస్థాయిలో ఇంటి నిర్మాణం జరగాలంటే రూ.5 లక్షలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇచ్చిన సెంటు భూమి సరిపోదని, పట్టణ ప్రాంతాలలో లబ్ధిదారులకు 2 సెంట్ల, గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్ల స్థలాన్ని పంపిణీ చేయాలన్నారు. డిసెంబర్ 12న రైతు సమస్యలపై కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపు ఇచ్చారు.

ప్రధానిపై సీఈసీ చర్యలు తీసుకోగలరా?

(మొదటిపేజీ తరువాయి)

అధికారాన్ని శాశ్వతంగా నిలబెట్టుకోవాలనుకుంటోంది. పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి ప్రభుత్వం కూడా అన్ని విషయాల్లో తమకు 'యస్' అంటూ తలూపే వ్యక్తినే ఎన్నికల ప్రధానాధికారిగా నియమిస్తోంది. అప్పుడు అది స్వతంత్ర సంస్థ ఎలా అవుతుంది? ఉదాహరణకు... ప్రధాన మంత్రికి వ్యతిరేకంగా ఏమైనా ఆరోపణలు వస్తే... అప్పుడు ప్రభుత్వం నియమించిన సీఈసీ... ప్రధానిపై చర్యలు తీసుకోగలరా? తీసుకోలేరు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అవసరమైన ప్రధానిపై చర్యలు తీసుకునే సీఈసీ కావాలి' అని ధర్మాసనం అభిప్రాయపడింది. కాగా అరుణ్ గోయెల్ ఇటీవలే స్వచ్ఛంద పదవీ విరమణ చేసినందున... నవంబర్ 19న ఎన్నికల కమిషనర్‌గా ఆయనను నియమించడంలో ఏదైనా నిబంధనల ఉల్లంఘన ఉందా అనేది తెలుసుకోవాలనుకుంటున్నట్లు రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. దీనిపై గురువారం కూడా విచారణ కొనసాగనుంది. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.ఎం.జోసెఫ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ నియామకంలో ఏదైనా 'నిబంధనల ఉల్లంఘన' ఉందా అని తెలుసుకోవాలని కోరింది. 'అరుణ్ గోయెల్ గత గురువారం వరకు ప్రభుత్వంలో సెక్రటరీ స్థాయి అధికారిగా పని చేశారు. అకస్మాత్తుగా, శుక్రవారం ఆయనను ఎన్నికల కమిషనర్‌గా నియమించారు' అని కార్యకర్త-న్యాయవాది ప్రశాంత్ భూషణ్ చెప్పారు. కాకపోతే డిసెంబర్ 31న 60 ఏళ్ల వయసులో ఆయన పదవీ విరమణ చేయవలసి ఉంది. వ్యక్తిగత కేసులను స్వీకరించడం సరికాదని ప్రభుత్వ న్యాయవాది, అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి చేసిన అభ్యంతరాలను కోర్టు తిరస్కరించింది. 'యంత్రాంగం ఏమిటో మేము చూడాలనుకుంటున్నాము. మేము దానిని విరోధిగా పరిగణించము. దానిని మా రికార్డ్ కోసం ఉంచండి. కానీ మీరు ప్రతిదీ బాగుంది అని చెబుతున్నందున మేము తెలుసుకోవాలనుకుంటున్నాము. మీకు రేపటి వరకు సమయం ఉంది' అని న్యాయస్థానం ప్రభుత్వ న్యాయవాదికి తెలిపింది.

భూ తగాదాలకు శాశ్వత పరిష్కారం

విశాలాంధ్ర-శ్రీకాకుళం: సివిల్ తగదాలు ఎక్కువగా భూములకు సంబంధించినవే వున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర భూసర్వేతో సివిల్ తగాదాలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆధునిక డిజిటల్ రెవెన్యూ రికార్డులు సిద్ధమైన గ్రామాల్లో రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని బుధవారం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ... అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శాస్త్రియంగా 17వేలకు పైగా రెవెన్యూ గ్రామాల్లో భూ సర్వే చేస్తున్నామని, తొలిదశలో 2వేల

రెవెన్యూ గ్రామాల్లో భూ రికార్డుల ప్రక్షాళన జరిగిన 7,92,238 మంది రైతులకు భూ హక్కు పత్రాలు అందిస్తున్నామని చెప్పారు. 2023 ఫిబ్రవరిలో రెండవ దశలో 4వేల గ్రామాల్లో సర్వే చేసి మేలో 6 వేల గ్రామాల్లో హక్కుల పత్రాలు అందిస్తామన్నారు. 2023 చివరి నాటికి అన్ని గ్రామాల్లో భూసర్వే పూర్తవుతుందని సీఎం తెలిపారు. సివిల్ కేసుల్లో ఎక్కువ భూ వివాదాలేనని, సరైన వ్యవస్థ లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని ఆ పరిస్థితులను మార్చేందుకే ఈ విప్లవాత్మక సమగ్ర భూసర్వే తీసుకువచ్చామన్నారు. భూముల కొలతలు వేసి, మార్కింగ్ చేసి ప్రతీ కమతానికి ఒక గుర్తింపు సంఖ్యతో పాటు హద్దు రాళ్లు కూడా వేసి రైతులకు అందిస్తామన్నారు. 19,849వేల సర్వేయర్‌లను నియమించి రూ.వెయ్యికోట్లతో ఈ కార్యక్రమం చేపట్టామని, సర్వే పూర్తి అయ్యాక భూ హక్కు పత్రాలు రైతుల చేతుల్లో పెడతామన్నారు. క్రయ విక్రయాలకు సంబంధించి గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు జరిగేలా కొత్త మార్పులకు శ్రీకారం చుడుతున్నట్లు సీఎం చెప్పారు. గ్రామ సచివాలయాలు, వాలంటరీ వ్యవస్థలతో పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని, 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేసి, కుప్పంతో సహా 25కొత్త రెవెన్యూ డివిజన్‌లు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతోనే మూడు రాజధానులు ఏర్పాటు చేయడానికి నిర్ణయించామని, గత ప్రభుత్వ హయాంలో 11 మెడికల్ కాలేజీలు ఉంటే, రాష్ట్రంలో మరో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజల వద్దకే పాలన తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో ప్రజల సహకారార్థం ఎన్నో గొప్ప కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, దీన్ని చూసి ఓర్వలేక చంద్రబాబు నాయుడు తన మీడియాను అడ్డుపెట్టుకుని అబద్ధాలు చెబుతూ ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారన్నారు. బాబు మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరని, బాబుకు ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. తనకు తాను పార్టీ పెట్టుకుని అధికారంలోకి వస్తే ఎంజీఆర్, ఎన్టీఆర్, జగన్ అంటారని, కూతురునిచ్చిన మామ పార్టీని, సీఎం కుర్చీని కబ్జా చేస్తే చంద్రబాబు అంటారని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేసేది చంద్రబాబు అని, అలాంటి బాబుకు వత్తాసు పలుకుతున్న దుష్టతుష్టయాన్ని ఏమనాలని, మోసకారికి నిదర్శనమైన చంద్రబాబు లాంటి వారికి మళ్లీ అధికారం ఇవ్వొద్దని సీఎం జగన్ విజ్ఞప్తి చేశారు. పరాయి వాడి ఆస్తి ఆక్రమిస్తే కబ్జాదారుడని, పరాయి స్త్రీ మీద కన్నువేసి ఎత్తుకుపోతే రావణుడు అంటారని, రావణుడుని సమర్థించిన వారిని రాక్షసులంటామని, దుర్యోధనుడ్ని సమర్థించిన వారిని దుష్టచతుష్టయం అంటామని, మామకు వెన్నుపోటుపొడిచి ప్రజలకు మోసం చేస్తున్న, బాబును సమర్థిస్తున్న కొన్ని మీడియా సంస్థలను, పవన్ కల్యాణ్‌ను మరేమనాలని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో మీకు, మీ ఇంటికి మంచి జరిగిందా లేదా అనేది బేరీజు వేసుకుని మంచి చేసిన వారికి ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యన్నారాయణ, పశుసంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ ఎస్వీ సింగ్, జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జేసీ నవీన్‌కుమార్, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, వరుదు కళ్యాణి, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, అధికార పార్టీ నాయకులు, జిల్లా యంత్రాంగం, వైసీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సీఎం ఉదారత...

విశాలాంధ్ర- నరసన్నపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి, వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి తన ఉదారతను మరోసారి చాటుకున్నారు. శ్రీకాకుళం జిల్లా రేగిడి ఆమదాలవలస మండలం, చిన్న శిర్లాం గ్రామానికి చెందిన మీసాల కృష్ణవేణి కుమార్తె ఇంద్రజ తీవ్ర అనారోగ్య సమస్యతో సతమతమవుతోంది. ఇంద్రజ అనారోగ్యాన్ని సీఎంకు వివరించేందుకు తల్లిదండ్రులు బుధవారం నరసన్నపేట వచ్చారు. బహిరంగ సభకు వెళ్తున్న సీఎం తన కాన్వాయ్ నుండి బాధితులను గమనించి పరామర్శించారు. ఇంద్రజ అనారోగ్యాన్ని కృష్ణవేణి సీఎంకు వివరించగా, వైద్య ఖర్చుల కోసం రూ.20లక్షలు సహాయమందించి, పూర్తిగా వైద్య సేవలందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి అందించిన సహాయానికి కృష్ణవేణి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం జగన్ పర్యటనలో అపశృతి

విశాలాంధ్ర-అనకాపల్లి: శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో సీఎం జగన్ పర్యటనలో అపశృతి చోటుచేసుకుంది. బందోబస్తు విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందారు. స్థానిక శారదానగర్‌కు చెందిన ఎర్రంశెట్టి అప్పారావు (హెచ్ సీ 1115) ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. భూ హక్కు- రీ సర్వే కార్యక్రమం నిమిత్తం నరసన్నపేటలో బుధవారం సీఎం బహిరంగ సభ నిర్వహించారు. విధులు నిర్వహించేందుకు అప్పారావు మంగళవారం నరసన్నపేట వెళ్లారు. విధుల్లో ఉండగానే ఆయన గుండెపోటుకు గురై మృతి చెందారు. అప్పారావు 1990లో పోలీస్ శాఖలో చేరారు. అతడికి ఇద్దరు కొడుకులు.

'అనంత'లో జాకీ పరిశ్రమ ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యే తోపుదుర్తి దుశ్చర్యలతో తరలిపోయిన పరిశ్రమ
- సీఎం జగన్‌కు రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అనంతపురం జిల్లాలో జాకీ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం జగన్‌కు బుధవారం ఆయన ఒక లేఖ రాశారు. అనంతపురం జిల్లా, రాప్తాడు మండల కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో జాకీ పరిశ్రమకు స్థలాన్ని కేటాయించారని, ఆ స్థలాన్ని మా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్, అనంతపురం జిల్లా కార్యదర్శి సి.జాఫర్‌తో కలిసి తాను పరిశీలించానని పేర్కొన్నారు. రాప్తాడులో జాకీ పరిశ్రమ ఏర్పాటు చేస్తే దాదాపు 6 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ప్రధానంగా మహిళలకు గార్మెంట్ల తయారీ ద్వారా పని దొరుకుతుందని తెలిపారు. జాకీ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలంటే తనకు రూ.10 కోట్లు ఇవ్వాలంటూ పార్టీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేయడంతో అందుకు ఫ్యాక్టరీ యాజమాన్యం నిరాకరించిందన్నారు. జాకీ పరిశ్రమను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికలైన వెంటనే ఎస్సార్ కన్‌స్ట్రక్షన్లపై దాడులు చేయగా, పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవడం గమనార్హమని విమర్శించారు. గతంలో ఇదే అనంతపురం జిల్లాలో ఉన్న కియా కార్ల ఫ్యాక్టరీ యాజమాన్యంపై హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ బెదిరింపులకు దిగినట్లు ఆరోపణలున్నాయని గుర్తుచేశారు. ఇప్పుడు వైసీపీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ దుశ్చర్యలతో జాకీ పరిశ్రమ తరలిపోవడంతో స్థానిక ప్రజల్లో ఆందోళన వెల్లువెత్తుతోందన్నారు. పారిశ్రామికవేత్తలను ప్రజాప్రతినిధులు బెదిరిస్తే పరిశ్రమలు ఎలా ఏర్పాటు అవుతాయని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో పారిశ్రామిక వేత్తలను బెదిరించడం దుర్మార్గమని ఖండించారు. తక్షణమే ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌పై వస్తున్న ఆరోపణల పై సమగ్రంగా విచారించాలన్నారు. ముడుపుల కోసం వ్యాపారవేత్తలపై దౌర్జన్యాలకు, దాడులకు, బెదిరింపులకు పాల్పడిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని అరెస్టు చేయాలని, రాప్తాడులో జాకీ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టవలసిందిగా ఆ లేఖలో రామకృష్ణ డిమాండ్ చేశారు.

5న ఢిల్లీకి చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబుకు మరోసారి కేంద్రం నుంచి పిలుపు వచ్చింది. డిసెంబరు 5న సాయంత్రం 5 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగే దేశంలోని వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షుల సమావేశానికి హాజరుకావాల్సిందిగా కేంద్రం కోరింది. డిసెంబర్ 1వ తేదీ నుంచి నవంబర్ 30, 2023 వరకు జీ-20 దేశాల కూటమికి భారతదేశం అధ్యక్షత వహించనుంది. భారత్‌లో నిర్వహించే జీ -20 భాగస్వామ్య దేశాల సమావేశాలపై రాజకీయ పార్టీల అధ్యక్షులతో ప్రధాని మోదీ చర్చించి సలహాలు తీసుకోనున్నారు. ఇందుకోసం వచ్చే నెల 5న రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసే సమావేశానికి హాజరుకావాల్సిందిగా పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి ప్రహ్లాద్ జోషి చంద్రబాబుకు ఆహ్వానం పంపారు. సమావేశ ప్రాధాన్యతను కూడా టీడీపీ అధినేతకు ఫోన్‌లో వివరించి హాజరు కావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు మరొకసారి చంద్రబాబు ఢిల్లీకి వెళ్లనున్నారు. ఇటీవల జరిగిన ఆజాదీకా అమృత్ మహోత్సవ్ సమావేశానికి కూడా చంద్రబాబును కేంద్రం ఆహ్వానించింది. ఆ సమావేశంలో ప్రధాని మోదీ... చంద్రబాబుతో ఐదు నిమిషాల పాటు ప్రత్యేకంగా మాట్లాడారు. 2019 ఎన్నికల ముందు ఎన్‌డీఏ కూటమి నుంచి బైటకొచ్చిన చంద్రబాబు దాదాపు మూడు సంవత్సరాల తర్వాత మోదీని కలవడంపై రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది.

నేటి నుంచి పాలీ టెక్‌ఫెస్ట్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యార్థుల సృజనాత్మకత, వినూత్న ఆలోచనలను ఉత్తేజపరిచే క్రమంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు విజయవాడ ఎస్ఎస్ కన్వెన్షన్‌లో రాష్ట్ర స్థాయి పాలీ టెక్‌ఫెస్ట్-2022 నిర్వహిస్తున్నట్లు సాంకేతిక విద్యా శాఖ సంచాలకులు చదలవాడ నాగరాణి తెలిపారు. మేక్ ఇన్ ఇండియా, నైపుణ్య ఆంధ్రప్రదేశ్ ప్రచారాన్ని ప్రోత్సహించే క్రమంలో ఆవిష్కరణలు, పరిశోధనలను సులభతరం చేస్తూ పాలిటెక్నిక్ విద్యార్థులకు దిక్సూచిగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, విద్యామంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. డిప్లొమా విద్యార్థులు టెక్నోక్రాట్‌గా రూపాంతరం చెందడానికి ఇది మంచి అవకాశమని తెలిపారు. నవంబర్ 14 నుంచి 17వరకు నోడల్ ప్రిన్సిపాళ్ల ద్వారా 13 ప్రదేశాలలో ప్రాంతీయ పాలీ టెక్‌ఫెస్ట్‌లు నిర్వహించగా ఇందులో 4310మంది విద్యార్థులు టెక్‌ఫెస్ట్‌లో హాజరై...1084 వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారని, వాటిలో ఎంపిక చేసిన 253 ప్రాజెక్ట్‌లు విజయవాడలో ప్రదర్శించనున్నామని నాగరాణి వివరించారు. రాష్ట్ర స్థాయి పాలీ టెక్ ఫెస్ట్ ఉత్తమ ప్రాజెక్టులకు మొదటి బహుమతిగా రూ. లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.50వేలు, తృతీయ బహుమతిగా రూ.25 వేలు అందిస్తామన్నారు.

టిడ్కో గృహాలు అప్పగించాలి

5న మండల కేంద్రాల్లో నిరసనలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-ఉయ్యూరులకంకిపాడు: టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అప్పగించేవరకు ఆందోళనలు నిర్వహిస్తూనే ఉంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్ అన్నారు. కృష్ణాజిల్లా కంకిపాడు లోని పార్టీ కార్యాలయంలో బుధవారం సీపీఐ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిసెంబర్ 5న అన్ని మండల కేంద్రాల్లోని టిడ్కో గృహ సముదాయాల వద్ద సీపీఐ, బీకేఎంయూ సంయుక్త ఆధ్వర్యంలో నిరసనలు తెలపాలని, ప్రభుత్వం దిగి వచ్చేంతవరకు పోరాడాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలు పు నిచ్చారు. 12న రైతాంగ సమస్యలపై ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టి విజయ వంతం చేయాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అంద జేయకుంటే ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సీనియర్ నాయకుడు మేరుగు విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు టి.తాతయ్య, మంటాడ ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలపై కలసికట్టుగా పోరాడుదాం

ఏపీ రైతు సంఘం నేతల పిలుపు

విశాలాంధ్ర-పత్తికొండ: రైతు సమస్యల పరిష్కారానికి రాజకీయాలకతీతంగా కలిసికట్టుగా పోరాడాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పిలుపునిచ్చారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండగిరి రామలింగేశ్వర శివాలయ కొండపై వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ, రాజకీయాలు వేరనీ, రైతులంతా ఒకటేనని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతుల ఆత్మహత్యలు నివారించాలని, పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని, నకిలీ విత్తనాలను అరికట్టాలని కోరారు. పత్తికొండ ప్రాంతంలో గిట్టుబాటు ధర లభించక టమాటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఎన్నికల నినాదంగా మారిపోయిందని అన్నారు. రైతులంతా కలిసికట్టుగా సహకార పరపతి సంఘం ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. హంద్రీనీవా ప్రధాన కాలువకు మార్చి ఆఖరు వరకు నీళ్లు వదిలి పంట పొలాలను కాపాడాలన్నారు.

రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కారన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, వైసీపీ, టీడీపీలకు చెందిన రైతు సంఘం నాయకులు పి.భీమ లింగప్ప, ఎం.నబిరసూల్, డి.రాజాసాహెబ్, పెద్ద ఈరన్న, ఎం.జగదీష్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, సోమశేఖర్, రామ నాయుడు, లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ పక్కీరప్ప మాట్లాడారు. ఏవో వెంకటరాముడు, సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుదాస్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి, ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.ఎస్.వెంకట రాముడు, కారం నాగరాజు, సిద్దయ్య గౌడ్ పాల్గొన్నారు.

జేవీఎస్ ట్రస్ట్‌కు కుట్టు మిషన్ బహూకరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గొల్లపూడి సమీపం లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయ మొదటి అంతస్తులో నిర్వహిస్తున్న జోశ్యభట్ల వెంకట సుబ్బమ్మ (జేవీఎస్) ట్రస్ట్‌కు కుట్టు మిషన్‌ను దివంగత సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం బుధవారం బహూకరించారు. ట్రస్ట్‌లో పేదలకు కుట్టు శిక్షణ, కంప్యూటర్ పరిజ్ఞానం అందిస్తు న్నారు. కట్టు మిషన్‌ను ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ చేతుల మీదుగా అందజేశారు. దాత గబిట రామారావు, ట్రస్టు నిర్వాహకులు ఖాదర్ బాషా, ఉపాధ్యాయురాలు సిహెచ్.పుష్పాంజలి పాల్గొన్నారు.

సేవలు, బోధనలు వెలకట్టలేనివి

సత్యసాయి సమాధిని దర్శించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

విశాలాంధ్ర-పుట్టపర్తి: ప్రభుత్వాలు, వ్యవస్థలు చేయలేని బృహత్తర పనులు చేసి, సేవామార్గం అంటే ఏమిటో సత్యసాయి ప్రపంచానికి చూపించారని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాల్‌లో సత్యసాయి మహా సమాధిని కేంద్ర మంత్రి దంపతులు బుధవారం దర్శించుకున్నారు. బాబా జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి ప్రసంగించారు. బాబా అంటే ఒక వెలుగని, ఒక విశ్వాసం... ఒక నమ్మకం... ఒక ధైర్యం అని, నిత్య గురువు అని కొని యాడారు. ప్రపంచంలో 150 దేశాలకు పైగా సేవాసమితులు ఉండటం విశేషం అన్నారు. ఒక గురువుగా గౌరవించబడటం, పూజించబడటం ఒక్క సత్యసాయికే దక్కుతుందన్నారు. ఇక్కడి సూపర్ స్పెషాలిటీ, జనరల్ ఆసుపత్రి ద్వారా అనేక కష్టమైన రోగాలు నయం అవుతున్నాయన్నారు. ఈ ప్రాంతంలో విలువలతో కూడిన విద్యాసంస్థలను బాబా నెలకొల్పారన్నారు. అప్పట్లో గుక్కెడు నీళ్లకు అల్లాడిపోతున్న ప్రజలకు దాహార్తి తీర్చిన మహనీయుడు బాబా అన్నారు. ఇతర రాష్ట్రాల్లోని పలు గ్రామాలకు నీరు అందించారన్నారు. ప్రశాంతి నిలయంలో ప్రశాంతత దొరుకుతుందన్నారు. 'అందరినీ సేవించు, అందరినీ ప్రేమించు' అనే బాబా సూక్తిని ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. ట్రస్టు వార్షిక నివేదిక విడుదల: సత్యసాయి ట్రస్టు వార్షిక నివేదికను కేంద్ర మంత్రి విడుదల చేశారు. వార్షిక ఆదాయం రూ.200 కోట్లు కాగా వ్యయం 120 కోట్లని నివేదికలో పేర్కొన్నారు. ట్రస్టు కార్యక్రమాలు పారదర్శకంగా ఉంటాయని ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, ట్రస్టు సభ్యులు ఆర్ జె రత్నాకర్, చక్రవర్తి, డాక్టర్ మోహన్, నాదానంద, మాజీ మంత్రులు గీతారెడ్డి, పల్లె రఘునాథరెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

ఏపీఎస్ఎస్‌డీసీ, డీబీఎఫ్ ఒప్పందం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగులో నిరుద్యోగ యువతకు వివిధ విభాగాల్లో శిక్షణ అవసరాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), దాల్మియా భారత్ ఫౌండేషన్ (డీబీఎఫ్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ మేరకు నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయంలో బుధవారం ఏపీఎస్ఎస్‌డీసీ, డీబీఎఫ్ విభాగాల అధిపతులు ఎంవోయూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో, నిరుద్యోగ యువత కోసం జమ్మలమడుగు ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాంగణంలో డీబీఎఫ్ ఏర్పాటు చేసిన ల్యాబ్‌లో క్యాపిటల్ గూడ్స్, నిర్మాణం, ఈటఈఎస్ హెల్త్‌కేర్‌లు, లీడ్ సెక్టార్లలో శిక్షణనిస్తారు. డీబీఎఫ్ నుంచి ఈఎస్‌జీ కంట్రీ హెడ్ అరవింద్ మధుకర్ బోధన్‌కర్, దాల్మియా సిమెంట్ హెడ్ ముఖేష్ సిన్హాలి, దాల్మియా భారత్ ఫౌండేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ డీజీఎం బి.సంజయ్ కుమార్, ఆపరేషన్ల హెడ్ అశ్విన్, ఏపీఎస్ఎస్‌డీసీ నుంచి సీఈవో ఎస్.సత్యనారాయణ, ఈడీలు ఎంకేవీ శ్రీనివాసులు, డీవీ రామకోటి, జనరల్ మేనేజర్ గోపినాథ్, హెచ్.భారతి పాల్గొన్నారు.

సాహిత్య విస్తరణలో విశాలాంధ్ర కృషి అద్వితీయం: చలం

విశాలాంధ్ర-విశాఖ: సాహిత్య విస్తరణలో విశాలాంధ్ర చేస్తున్న కృషి అద్వితీయమని ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, ద్రావిడ విశ్వ విద్యాలయ మాజీ ఉప కులపతి ఆచార్య కేఎస్ చలం అన్నారు. విశాలాంధ్ర బుక్ హౌస్ 21వ పుస్తక మహోత్సవ ప్రాంగణాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చలం మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర జిల్లాల కవులు, రచయితలు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారంటే అందుకు విశాలాంధ్ర బుక్ హౌస్ కారణమన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విశాలాంధ్ర విస్తరణ జరగాలని ఆకాంక్షించారు. వేలాది రకాల పుస్తకాలు ఒకే వేదికపై లభించడం అభినందనీయమని అన్నారు. అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, మేనేజర్ పీఏ రాజు, మూర్తి, అనీల్ పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించుకుందాం

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: ప్రజలను చైతన్యం చేసి ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డీ ఆదినారాయణ పిలుపునిచ్చారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే దీక్షలు బుధవారం 650వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వరంగ సంస్థలతోనే సంపద ఒనగూరడంతో పాటు, ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఉద్యమ పంథాను ప్రజలకు అర్థమయ్యే రీతిలో చెబితే ప్రజా ఉద్యమంగా మలచుకుని కేంద్రం ఎత్తుగడలను వ్యతిరేకించవచ్చన్నారు. నిర్వాసిత కాలనీలలో గ్రామ స్థాయిలో కమిటీలు వేసి ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్లాలన్నారు. పదవులే పరమావధిగా రాజకీయాలు నడుపుతున్నారని, ప్రజల ఆకాంక్షలపై రాజకీయ పార్టీలు స్పందించకపోవడం పరిపాటిగా మారింది ఆవేదన వ్యక్తం చేశారు.మంత్రి రాజశేఖర్, వై టీ దాస్, వరసాల శ్రీనివాసరావు, నీరుకొండ రామచంద్రరావు, మోహన్ కుమార్, మసేను రావు, చంద్రరావు, డీ నర్సింగరావు, డీవీ రమణ రెడ్డి, దొమ్మేటి అప్పారావు, పరంధామయ్య, దాలినాయుడు, కొమ్మినేని శ్రీనివాసరావు, నమ్మి అప్పలరాజు, రామ్ కుమార్ శ్రీనివాసరాజు, కారు రమణ, పిట్ట రెడ్డి, పాల్గొన్నారు.

భూములు కాజేయడానికే 'భూ రక్ష': బండారు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖ పట్నం: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భూ రక్షకుడు కాదని, భక్షకు డని టీడీపీ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి విమర్శించారు. బుధవారం ఆయన టీడీపీ కార్యాలయంలో పార్లమెం టరీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సర్వే పూర్తిగా ప్రజలను మోసం చేయడం కోసమేనని, జగనన్న శాశ్వత భూ హక్కు అంటున్నారని, ప్రజల హక్కు అనడం లేదని విమర్శించారు. ఎలాంటి అవగాహన లేకుండా ప్రజల భూములపై ప్రభుత్వం పెత్తనం ఏంటని ప్రశ్నించారు. 'మీ భూమి మా కర్మ' అన్నట్లు తయారైందన్నారు. అసలు ఈ భూములపై జగన్ చిత్రపటం ఏంటని ప్రశ్నించారు. దీనిపై కోర్టును ఆశ్రయిస్తామన్నారు. భూముల మీద వచ్చిన సమస్యలే ఇంతవరకు పరిష్కరించలేదని, ముందు చిత్రపటాలు తొలగించాలని బండారు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రైతులకు భూములపై రక్షణ లేకుండా పోయిందన్నారు. రిజిస్ట్రేషన్ చేయాలంటే వలంటీర్ సంతకం ఉండాలనడం దుర్మార్గమన్నారు. రెవెన్యూ శాఖను పూర్తిగా భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. స్పందనలో వచ్చిన రెవెన్యూ దరఖాస్తులు 90 శాతం పరిష్కారం కావడం లేదని, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గంలో మహిళ ఆత్మహత్య చేసుకోలేదా అని బండారు ప్రశ్నించారు. దొంగ రిజిస్ట్రేషన్‌లపై ప్రభుత్వం శ్రద్ధ చూపకుండా, సర్వే రాళ్లపై జగన్ బొమ్మ వేసుకోవడం సిగ్గుచేటన్నారు.

అధికారులు న్యాయబద్ధంగా ఉండాలి: అయ్యన్న

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాష్ట్రాభివృద్ధికి ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు స్తంభాల్లాంటివారని, కళ్ళుతెరిచి న్యాయబద్ధంగా వ్యవహ రించాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు కోరారు. బుధవారం పార్టీ కార్యాలయం లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీవీ నరసింహారావు సీఎంగా ఉన్నప్పుడు హైదరాబాద్‌లో అల్లర్లు జరుగుతున్నాయని, అక్కడకు వెళ్లొద్దని చీఫ్ సెక్రెటరీ సూచించారన్నారు. సీఎం వినకపోతే కారు తాళం వేసి జేబులో వేసుకున్నారని తెలిపారు. ఆ తర్వాత రోజు వాస్తవం తెలుసుకున్న సీఎం పీవీ, చీఫ్ సెక్రెటరీని అభినందించారని గుర్తు చేశారు. సీఎం జగన్ పరిస్థితి దేరా బాబాలా ఉందని, చున్నీలు తొలగించడం మహిళలను అవమానించడమేనన్నారు. ఏ సీఎం ఇంత చెత్తగా పనిచేయలేదని, విశాఖలో డీజీపీ ప్రకటనను ఖండిస్తున్నామన్నారు. గంజాయి అరికట్టామని చెప్పడం సరికాదనీ, ఎన్ని గంజాయి కేసులు పరిష్కరించారో డీజీపీ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు జగన్ చెప్పినట్టు చేస్తున్నారని, సీనియర్ ఐఏఎస్ అధికారి కృష్ణబాబు కూడా అబద్ధాలు చెబుతున్నారన్నారు. జీవో లేకుండా మెడికల్ కాలేజీలు ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పార్లమెంటరీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పాసర్ల ప్రసాద్, ప్రచార కార్యదర్శి బైరెడ్డి పోతనరెడ్డి పాల్గొన్నారు.

సంపాదకీయం

ప్రభుత్వానికి సుప్రీం చురకలు

ఎన్నికల కమిషన్ రాజ్యాంగ సంస్థ. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను, ఇతర కమిషనర్లను ప్రభుత్వమే నియమిస్తుంది. వీరి నియామకంలో రాజకీయపార్టీలు, ప్రభుత్వం జోక్యం ఉంటుందని అందువల్ల కమిషన్ పక్షపాతంగా వ్యవహరిస్తోందని, స్వతంత్రంగా పనిచేయడంలేదన్న విమర్శలు చాలాకాలంగా ఉన్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా 1991 చట్టం ప్రకారం ఆరేళ్లపాటు పనిచేయడానికి రాజ్యాంగం అవకాశం కల్పించింది. తక్కువ పదవీకాలంతో కమిషనర్‌ని నియమించడం వల్ల ఎన్నికల కమిషన్ స్వయంప్రతిపత్తి ధ్వంసం అవుతుందని సుప్రీంకోర్టు మంగళవారం వ్యాఖ్యానించింది. ఇది తీవ్ర ఆందోళన కలిగించే విషయమని కూడా సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఈ ధోరణివల్ల ప్రధాన ఎన్నికల కమిషనర్ తాను సంకల్పించిన ఎన్నికల సంస్కరణలు అమలు చేయలేరని ధర్మాసనం తెలిపింది. ఎన్నికల కమిషన్‌ను ఏర్పాటుచేసిన నాటి నుండి కమిషనర్ల నియామక కాలానికి సంబంధించిన గణాంకాలను ధర్మాసనం ప్రస్తావించింది. జస్టిస్ కె.ఎం జోసెఫ్ నాయకత్వంలోని ఐదుగురు సభ్యులుగల రాజ్యాంగ ధర్మాసనం పిటిషన్‌ను విచారించింది. రాజకీయ పార్టీలు, ప్రభుత్వ జోక్యం లేకుండా ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా పనిచేయడానికి అవకాశం కల్పించాలని కోరుతూ వచ్చిన పిటిషన్‌ను ధర్మాసనం విచారించింది. కేంద్ర ప్రభుత్వాలు ఎన్నికల కమిషనర్లను ఎంపికచేసి నియమిస్తున్న కాలపరిమితి చాలా తక్కువగా ఉంటోంది. రాజ్యాంగం అమలులోకి వచ్చిన 1950 నుండి 1996 వరకు కేవలం పదిమంది ప్రధాన ఎన్నికల కమిషనర్లనే ప్రభుత్వం నియమించింది. టి.ఎన్ శేషన్ ఒక్కరే ఆరేళ్లు పనిచేశారు. ఆయన పదవీకాలంలో రాజకీయ పార్టీలను, ప్రభుత్వాన్ని గడగడలాడించి ఎన్నికల సంస్కరణలు తీసుకురావడానికి ప్రయత్నించారు. ఎన్నికలను న్యాయబద్ధంగా పారదర్శకంగా నిర్వహించడానికి కృషి చేశారు. ఎంతటివారినైనా లెక్క చేయకుండా తన కర్తవ్యాన్ని నిర్వహించి మంచిపేరు తెచ్చుకున్నారు. ఆయన తర్వాత గడచిన 26 ఏళ్ల కాలంలో 15 మంది ప్రధాన ఎన్నికల కమిషనర్లను ప్రభుత్వాలు నియమించాయి.

ధర్మాసనంలో న్యాయమూర్తులు అజయ్‌రస్తోగి, అనురుద్ధబోస్, హృషికేశ్‌రావ్, సి టి రవికుమార్ ఉన్నారు. ఎన్నికల కమిషనర్లు పనిచేసిన పదవీకాలం గణాంకాలు విభ్రాంతి గొలిపాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎన్నికల కమిషన్ స్వతంత్రత పూర్తిగా ధ్వంసమైంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ తాను అనుకున్నది ఏనాడూ అమలు జరపలేదు. యూపీఏ ప్రభుత్వకాలంలో గానీ, ఎన్‌డీఏ ప్రభుత్వంలో గానీ పరిస్థితి ఒకేవిధంగా ఉందని ధర్మాసనం చేసిన వ్యాఖ్య నూటికి నూరు శాతం వాస్తవం. 2004-2015 మధ్యకాలంలో ఆరుగురు ఎన్నికల కమిషనర్లను నియమించగా ప్రస్తుత ప్రభుత్వం గత ఏడేళ్లకాలంలో ఎనిమిది మందిని నియమించింది. అంటే నరేంద్ర మోదీ ప్రభుత్వం నియమించిన కమిషనర్లు అతి తక్కువకాలం మాత్రమే పనిచేయ గలిగారు. కొన్ని నెలలకాలం మాత్రమే పనిచేసేవారు ఎలాంటి మార్పులు చేయలేరు. పైగా వీరిని నియమించే ప్రభుత్వాలు తమ ఆకాంక్షలను నెరవేర్చుకోవడానికి ఈ వ్యవస్థను దుర్వినియోగం చేసే అవకాశం లేకపోలేదు. మరో కీలకమైన విషయాన్ని కూడా ధర్మాసనం పేర్కొంది. మనకంటే మేలుగా పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్ సహా అనేక దేశాల్లో ఎన్నికల కమిషన్ల వ్యవస్థలున్నాయని ధర్మాసనం చేసిన వ్యాఖ్య మన పాలకులు ఎంత లోపభూయిష్టంగా పనిచేస్తున్నారని అర్థం చేసుకోవచ్చు. ప్రధాన ఎన్నికల కమిషనర్లలో ఒక్కరిని కూడా ఆరేళ్ల పదవిని నిర్వహించడానికి వీలుగా నియమించకపోవడానికి పాలకుల ఎత్తుగడలు, వ్యూహాలు ఉండవని చెప్పలేము. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఇదే ధోరణి కొనసాగుతున్నప్పటికీ మోదీ ప్రభుత్వ హయాంలో ఎన్నికల కమిషన్ కూడా ప్రధాని కనుసన్నల్లో పనిచేయవలసివచ్చిందన్న ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయి.

ప్రధాన ఎన్నికల కమిషనర్ల నియామకానికి కొలీజియం లాంటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోరడం చాలా సహేతుకంగా ఉంది. ప్రభుత్వానికి నియమించదలచిన అభ్యర్థి పుట్టిన తేదీ తెలుస్తుంది. వారి పదవీ విరమణకాలం తెలుస్తుంది. అలాంటప్పుడు ఆరేళ్లు పనిచేయడానికి అవకాశం గల సీనియర్ న్యాయమూర్తులను ఎంపికచేసి నియమించవచ్చు. ఆరేళ్లు పనిచేయడానికి వీలులేని అభ్యర్థులను మాత్రమే ప్రభుత్వాలు ఎందుకు ఎంచుకుంటున్నాయని ధర్మాసనం ప్రశ్నించింది. ఇలాంటి ప్రశ్నలకు జవాబులుండవు. ప్రభుత్వాలు తమకు అనుకూలంగా వ్యవస్థలలో మార్పులు చేయడానికి అంతగా ఆసక్తి చూపవు. ఆర్టికల్ 324(2) ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్లను పార్లమెంట్ చేసే చట్టానికిలోబడి రాష్ట్రపతి నియమిస్తారు. ఈ చట్టాన్ని ప్రభుత్వాలు అమలు చేశాయా? అని కోర్టు అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణిని ప్రశ్నించింది.

ఎన్నికల కమిషనర్ల నియామకాలలో శాసనవ్యవస్థ చట్టాన్ని అమలుచేసిందా అన్న ప్రశ్నకు బహుశా జవాబు లేదు. "పార్లమెంట్‌కు రాజ్యాంగం తప్పక నెరవేర్చవలసిన ఒక బాధ్యతను అప్పగించింది. చట్టం చేయడానికి అవకాశం ఉన్నప్పుడు, అది చేయబోనని ఎంతకాలం వాదిస్తారు" అని ప్రశ్నించింది కోర్టు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 70ఏళ్లయిన తర్వాత ఈ అంశాన్ని మనం తీసుకున్నామని కోర్టు చెప్పగా ఈ విషయంలో పార్లమెంటు పరిధిలోకి కోర్టు వెళ్లరాదని అటార్నీ జనరల్ వాదించారు. "రాజ్యాంగం మౌనంగా" ఉండటంవల్ల అన్ని రాజకీయ పార్టీలు దుర్వినియోగం చేశాయి అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కమిషనర్ల ఎంపిక పానెల్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కూడా ఉండాలని ధర్మాసనం సూచించింది. కోర్టులు ప్రభుత్వాలకు చురకలు అంటించినా పెద్దగా ఫలితం ఉండదని ఏడుపదులకాలంలో ప్రజలు చూస్తున్న వాస్తవం. ఎన్నికల షెడ్యూలు ప్రకటన, అధికారుల బదిలీలు, ఇష్టం వచ్చినట్లుగా ప్రచారకాలంలో మాట్లాడినా మౌనంగా ఉండే కమిషనర్లు కొనసాగినంతకాలం, తమకు ప్రయోజనకరంగా ఉండే ఎన్నికల కమిషన్ ఉన్నప్పుడు పాలకులు మార్పులకు శ్రీకారం చుడతారా?

పంటల బీమాలో భారీ కుంభకోణం

డా॥సోమ మర్ల
ప్రిన్సిపల్ సైంటిస్టు (రిటైర్డు)

పంట బీమా పథకం ప్రారంభంలో 21 రాష్ట్రాల నుండి 30 శాతం రైతాంగం భాగస్వాములుగా ఉండే పథకంలో ప్రస్తుతం కేవలం 18 శాతం మంది రైతులు కూడా నమోదు చేసుకోలేదు. వీరిలో అధిక శాతం ప్రభుత్వ బ్యాంకుల ద్వారా విధిగా నమోదయినవారే. పంట నష్టాన్ని అంచనా వేసే నమూనా పంట కోతల విధానం చాలా ఆలస్యంగాను, అవకతవకలతోనూ ప్రైవేటు బీమా సంస్థలు చేపట్టటంతో అనేక వేల మంది పత్తి, వేరుశెనగ రైతులు నష్టాలకు గురవుతున్నారు. నష్ట పరిహారాన్ని కోరుతూ రైతులు సమర్పించే ఫిర్యాదులు (క్లెయిమ్‌లు) పరిశీలనా కమిటీలో విధిగా స్థానిక రైతు సంఘాల ప్రతినిధులను చేర్చుకోవాలి. పంట నష్టాలను వెంటనే అంచనా కట్టి రెండు వారాల్లోపు నష్ట పరిహారాన్ని రైతులకు అందచేయాలి. రైతులను మోసగిస్తున్న ప్రైవేటు బీమా కంపెనీల స్థానంలో పూర్తిగా నిర్వహణ ప్రభుత్వరంగ బీమా కంపెనీలకే అప్పగించాలి.

ప్రధాన మంత్రి పంటల బీమా పథకం అమలులో రైతులకు నష్టపరిహార చెల్లింపుల్లో 2021 పంట సీజన్లో జరిగిన కుంభకోణంపై సత్వరం కాగ్ (కార్పొరేట్ ఆడిట్ జనరల్) విచారణ చేపట్టాలని ఆర్థిక మంత్రిని కోరింది మరెవరో కాదు సాక్షాత్తు మరొక కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కోరారు. ఖరీఫ్ 2021 లో ఒరిస్సా రాష్ట్రాన్ని ఉదాహరణనిస్తూ బీమా ప్రీమియం చెల్లించి పంటలు నష్టపోయిన తరుణంలో రైతులకు నష్ట పరిహారాన్ని చెల్లించకుండా ప్రైవేటు బీమా కంపెనీలు నిధులను ఎలా కాజేశాయో లెక్కలతో సహా వివరించారు.

వర్షాలు లేక పంటలు ఎండి, చీడ పీడలకు గురై, అధిక వర్షాలతో పంట నష్టపోయే రైతులకు సాగుపై పెట్టుబడిలో కొంత భాగమైనా దక్కే పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం చేపట్టాలని వివిధ రైతు సంఘాలు ఎన్నో పోరాటాలు చేశాయి. రైతుల ఆందోళన ఫలితంగా ప్రధాని 2016 వ సంవత్సరంలో పంటలబీమాపథకాన్ని అత్యంతఆర్భాటంతో ప్రారంభించారు. అందులో సింహ భాగం ప్రీమియం (రైతుల వాటా కంటె హెచ్చుగా) ప్రభుత్వం చెల్లిస్తుందని, నష్టాల అంచనాకు యూనిట్‌గా గ్రామాలను తీసుకుని నష్ట పరిహారం సత్వరం చెల్లిస్తామని ప్రధాని చేసిన వాగ్దానాలకు రైతులు పరవశులయ్యారు. ప్రధాన పంటలైన వరి, గోధుమలే కాకుండా ఇతర పంటలుచెఱకు, పత్తి, కూరగాయలు, పళ్లతోటలకు సైతం ఈ పథకాన్ని విస్తరించటం, డ్రోన్ తదితర అధునాతన టెక్నాలజీతో పంట నష్టాన్ని అంచనా వేయనున్నట్లు ప్రకటించటంతో ఈ పథకంపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

కేవలం 2017 వ సంవత్సరంలో దేశంలోని 30 శాతం రైతులు రూ.9 వేల 410 కోట్లు ప్రీమియంను చెల్లించి పంటల బీమా పాలసీలను తీసుకున్నారు. ఈ పథకం నిర్వహణ బాధ్యత ప్రధానంగా భారతి ఎఎక్స్‌ఎ, రిలయన్స్, ఫ్యూచర్ తదితర (భారత ఇన్సూరెన్సు కంపెనీ వంటి ప్రభుత్వ రంగ బీమా సంస్థలకు అతి తక్కువ ప్రాతినిధ్యం) ప్రైవేటు బీమా కంపెనీలకు కల్పించటాన్ని ఆనాడే వివిధ రైతు సంఘాలు సందేహాలు వ్యక్తపరిచాయి.

రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్న ఈ పథకం పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారాన్నివ్వటంలో విఫలం కాగా, ప్రైవేటు బీమా కంపెనీలకు వేల కోట్ల లాభాలను చేకూర్చింది. ఫలితంగా రైతుల్లో విశ్వాసం సడలి ప్రారంభంలో 30 శాతం నమోదు నుండి గత సంవత్సరం 18 శాతానికి పడిపోయింది. గత ఐదు సంవత్సరాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రైతులు ప్రీమియం రూపంలో చెల్లించిన నగదు రూ.ఒక లక్షా 26 వేల 521 కోట్ల రూపాయలు గత సంవత్సరం, ప్రస్తుత ఖరీఫ్ సీజన్లలో అత్యధికంగా కురిసిన అకాల వర్షాల కారణంగా వివిధ రాష్ట్రాల్లో పంటలు నీట మునిగి రైతులు విపరీతంగా నష్టపోయారు. కాగా ఈ విపత్కర పరిస్థితుల్లో బీమా కంపెనీలు కేవలం రూ.87 వేల 300 కోట్ల రూపాయలు నష్టపరిహారంగా రైతులకు చెల్లించారు. పంట నష్టపోయిన రైతులు రూ.87,200 పరిహారం కోరుతూ క్లెయిములు చేయగా, అధిక శాతం ఫిర్యాదులు నిరాకరించటం జరిగింది. కాగా అతి స్వల్ప భాగస్వామ్యం కలిగిన ప్రభుత్వ రంగ బీమా సంస్థల 90 శాతం క్లెయిములను చెల్లించాయి. అంటే ప్రైవేటు బీమా కంపెనీలు రైతులకు రూ.87 వేల 300 కోట్ల రూపాయల నష్ట పరిహారాన్ని చెల్లించాయి. దాదాపు రూ.39 వేల కోట్లకు రైతులకు చెల్లించకుండా కాజేశాయన్న మాట. ప్రధాని బీమా పథకం అమలులో ప్రైవేటు బీమా కంపెనీలు భారతి ఎఎక్స్‌ఎ 72 శాతం, రిలయన్సు బీమా 59 శాతం, ఫ్యూచర్ కంపెనీ 61 శాతం క్లెయిములను చెల్లించకుండా స్వాహా చేశాయి. రైతులు నష్ట పరిహారం చెల్లింపులో ప్రైవేటు బీమా కంపెనీల అక్రమాలపై ప్రభుత్వం వెంటనే కేంద్ర అడిట్ జనరల్ ద్వారా విచారణ జరిపించాలని నవంబరు 21 వ తేదీన భారత కమ్యూనిస్టు పార్టీ పార్లమెంటు సభ్యులు వినయ్ విశ్వం ప్రధానికి లేఖ రాశారు. ఈ లేఖలో కేంద్రమంత్రి ప్రధాన్ పేర్కొన్న బీమా అక్రమాలను సైతం పేర్కొనటం జరిగింది.

పంట బీమా పథకం ప్రారంభంలో 21 రాష్ట్రాల నుండి 30 శాతం రైతాంగం భాగస్వాములుగా ఉండే పథకంలో ప్రస్తుతం కేవలం 18 శాతం మంది రైతులు కూడా నమోదు చేసుకోలేదు. వీరిలో అధిక శాతం ప్రభుత్వ బ్యాంకుల ద్వారా విధిగా నమోదయినవారే. పంట నష్టాన్ని అంచనా వేసే నమూనా పంట కోతల విధానం చాలా ఆలస్యంగాను, అవకతవకలతోనూ ప్రైవేటు బీమా సంస్థలు చేపట్టటంతో అనేక వేల మంది పత్తి, వేరుశెనగ రైతులు నష్టాలకు గురవుతున్నారు.

నష్ట పరిహారాన్ని కోరుతూ రైతులు సమర్పించే ఫిర్యాదులు (క్లెయిమ్‌లు) పరిశీలనా కమిటీలో విధిగా స్థానిక రైతు సంఘాల ప్రతినిధులను చేర్చుకోవాలి. పంట నష్టాలను వెంటనే అంచనా కట్టి రెండు వారాల్లోపు నష్ట పరిహారాన్ని రైతులకు అందచేయాలి. రైతులను మోసగిస్తున్న ప్రైవేటు బీమా కంపెనీల స్థానంలో పూర్తిగా నిర్వహణ ప్రభుత్వరంగ బీమా కంపెనీలకే అప్పగించాలి.

వనంలో ఏనుగులు జనంలోకి!

అరణ్యంలో అత్యంత శక్తిమంతమైన జంతువు ఏనుగు. వనంలో ఉండాల్సిన ఏనుగులు, పులులు జనంలో సంచరించి పెను విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఒరిస్సానుండి ఉత్తరాంధ్ర ప్రాంతానికి వచ్చిన ఏనుగులు సృష్టించిన అలజడి అంతా ఇంతా కాదు. ఇప్పటికి ఎనిమిది మంది రైతులను పొట్టన పెట్టుకున్న ఏనుగులు సుమారు 6 కోట్ల రూపాయలు విలువైన వ్యవసాయ పంటలను ధ్వంసం చేసాయి. ఇంత విధ్వంసం జరుగుతున్నా పాలకులు చేష్టలుడిగి ఉండడం దుర్మార్గమే. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలో 50వేల ఏనుగులు ఉన్నట్లు అంచనా. అందులో 50శాతం పైగా అంటే 25,333 భారతదేశంలోనే ఉన్నాయి. అత్యధికంగా కర్ణాటకలో 6049, అసోంలో 5719, కేరళలో 3054, తమిళనాడులో 2761, ఒడిశాలో 1976, ఉత్తరాఖండ్‌లో 1839, మేఘాలయాలో 1754, అరుణాచల్ ప్రదేశ్ 1614, ఆంధ్రప్రదేశ్‌లో 65 ఏనుగులు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వ నివేదికలు తెలియజేస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 1950 నాటికి భూభాగంలో 14శాతం అరణ్యాలతో నిండి ఉండేది. ఈ 72ఏళ్ల కాలంలో మానవ జీవనపరిణామ క్రమంలో చోటుచేసుకున్న మార్పులు, పాలకుల విధ్వంసకర విధానాల ఫలితంగా ప్రకృతి ప్రకోపానికి దారితీసాయి. అడవిలో దొరికే విలువైన కలప, ప్రకృతి సిద్ధమైన గనుల తవ్వకాలకు చేపట్టిన మైనింగ్ కార్యక్రమాలు, పారిశ్రామికీకరణ ఫలితంగా అటవీప్రాంతం 14శాతం నుంచి 6 శాతానికి క్షీణించింది. వన్య ప్రాణులు సహజసిద్ధంగా ఏర్పర్చుకున్న ఆవాసాలు ధ్వంసమయ్యాయి. ఫలితంగా వన్యప్రాణులు జనావాసాల మీదకు వచ్చి దాడులు చేస్తున్నాయి. మన కేంద్ర ప్రభుత్వం అందించే వివరాల ప్రకారం ప్రతి ఏటా ఏనుగులు దాడుల వలన 1500 మంది, పాముకాటు వలన 60వేలమంది, పులులు దాడి చేయడంతో సుమారు 100మంది మరణిస్తున్నారు.

ఏనుగులు, పులులు వంటి జంతువులు జనప్రవంతిలోకి వచ్చి ప్రజలపై దాడి చేసే సంఘటనలు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో ఇటీవలకాలంలో ఎక్కువఅయ్యాయి. ఆయాదేశాల ప్రభుత్వయంత్రాంగం శాస్త్రీయమైన విధానాలతో వాటి నివారణకు చర్యలు చేపడుతున్నారు. అలాంటి చర్యలు చేపట్టడంలో భారతదేశంలో ప్రభుత్వ యంత్రాంగాలు విఫలమయ్యాయి. అటవీప్రాంతానికి ఆనుకొనిఉన్న సమీప ప్రాంతాలలో బఫర్‌జోన్‌లు ఏర్పాటుచేసి చుట్టూ కందకాలు తవ్వించాలి. ఏనుగులు, పులుల వంటి జంతువులు సంచరించే ప్రాంతాలలో(తేనెటీగల కంచె) ఏర్పాటు చేయించాలి. రైతులు తమ పొలం గట్లపై తేనెటీగల తొట్టెలను ఏర్పాటుచేస్తే ఏనుగులు కదలికల వల్ల తేనెటీగలు తుట్టెలు కదలి తేనెటీగలు ఏనుగులపై దాడిచేసి ఏనుగులు తరలిపోయేలా చేస్తాయి. ఆ ప్రాంతానికి రావటానికి ఏనుగులు ఇష్టపడవు. ఇప్పటికే ఆఫ్రికా దేశాలు ఈ పద్ధతిని అవలంబించి విజయవంతం అయ్యాయి. అదే పద్ధతిని మనదేశంలోని కేరళ రాష్ట్రం త్రిచూర్ జిల్లా అటవీ వ్యవసాయశాఖ అధికారులు రైతులను ప్రోత్సహించి విజయం సాధించారు. ఏనుగులు తినటానికి ఇష్టపడని కాప్సికం, మిరప, పసుపువంటి పంటలను వేసేలా రైతులను ప్రోత్సహించాలి. పెరుగుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో జిపిఎస్, డ్రోన్లసహాయంతో ఏనుగులు కదలికలను నిశితంగా గమనించి గన్‌ల ద్వారా మత్తు ఇంజక్షన్ ప్రయోగించి బంధించే ప్రయత్నం కూడా చేపట్టాలి. శబ్దాలు చేసి మంటలు పెట్టి తాత్కాలిక ఉపశమనం కలిగిస్తున్నారే తప్ప పైన తెలిపిన విధంగా శాస్త్రీయమైన పద్ధతిలో శాశ్వతంగా ఏనుగుల తరలింపునకు అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టలేదనే చెప్పాలి. వన్యప్రాణుల దాడుల వలన ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు, పంటలు, ఆస్తులు నష్టపోయినవారిని ఒక్కో రాష్ట్రంలో ఒక రకంగా నష్టపరిహాన్ని నిర్ణయించి అమలుచేయడం సరైన విధానం కాదు. ఈ సమస్యపై జాతీయ విధానం రూపొందించి అమలు చేయాలి. భౌగోళిక స్వరూపం రీత్యా ఒరిస్సా అటవీ ప్రాంతానికి ఆనుకొని ఉండటం, ఒరిస్సాలో మైనింగ్ కార్యకలాపాలు ఎక్కువ కావడం, ఏనుగులు తినటానికి ఇష్టపడే చెరకు, అరటి, బొప్పాయి వంటి పంటలకు అనువైన ప్రాంతం కావడంతో ఏనుగులు సంవత్సరాలు తరబడి పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో తిష్ట వేసి ఉన్నాయి. ఈ ఏనుగుల సంచారంతో మైదానప్రాంతంలోఉండే రైతులు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాల్లో ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఈ సమస్య పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరైన విధానం కాదు. అటవీ, పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో నోడల్‌టీం ఏర్పాటుచేసి ఏనుగులు, పులులను బంధించేందుకు చర్యలుచేపట్టాలి. ఏనుగులు పులులసంచారంపై జిపిఎస్ టెక్నాలజీ ఉపయోగించి వాటి కదలికలను బట్టి నిరంతరం ప్రజలను అప్రమత్తం చేసే విధంగా చర్యలు చేపట్టాలి.

బి.వి. రమణ, 9440363968

విశ్వనరుడా మేలుకో

మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు అని డా.అందెశ్రీ చెప్పినట్టు, మాయమై పోతున్నడమ్మా రైతన్నవాడు అని పాడుకొనే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. రైతులకు వ్యతిరేకమైన రైతు నల్లచట్టాలకు మన దేశ మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఆమోదముద్రవేసి 2022 సెప్టెంబర్ నాటికి రెండు సంవత్సరాలైంది. దేశవ్యాప్తంగా ప్రత్యేకించి ఉత్తరాంధ్ర రైతులు చైతన్యయుతులై దేశ రాజధాని హస్తిన సరిహద్దుల్లో మోహరించి రిలే నిరాహార దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు, రహదారులపై బస, వంటావార్పు లాంటి ఎన్నో రకాల వినూత్న పద్ధతుల్లో ఆందోళన చేపట్టారు. ఏ రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండానే స్వచ్ఛందంగా లక్షలాది మంది రోడ్లపై ఉద్యమాలు నిర్వహించారు. అది కోవిడ్-19 అన్ని కులాలను, మతాలను, ప్రపంచ మానవాళి మొత్తాన్ని కబళించి మృత్యు ఘంటికలు మోగిస్తున్న వేళ. ప్రపంచం మొత్తం దేవుళ్ళకు కూడా మినహాయింపు ఇవ్వలేదు. దేవాలయ పూజారులు, ప్రతినిధులు, ప్రభుత్వమూ దేవుళ్లను దేవాలయాల్లో బంధించి, తాళాలు వేశారు. అలాంటి సమయంలో కూడా రైతులు ప్రాణాలు ఫణంగా పెట్టి, ఎండా, వానా, చలిని కూడా లెక్క చేయకుండా ఉద్యమాలు నిర్వహించారు. ఈ పోరాటంలో సుమారు 900 మందికి పై చిలుకు రైతులు ప్రాణాలు కోల్పోయారు. రైతులపై వాటర్ ఫైరింగులు, బాష్పవాయువు, టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఓ మంత్రి కొడుకైతే ఏకంగా జీపుల్తో రైతులను తొక్కించి చంపడం లాంటి అత్యంత కిరాతక చర్యలకు పూనుకోవడం జరిగింది. చివరకు పంజాబ్, యూపీ, తదితర రాష్ట్రాల్లో ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చి కేంద్ర ప్రభుత్వం కొంత దిగివచ్చి "ఈ చట్టాలు రైతులు అభివృద్ధికి ఎంతో అవసరం, అయినా మీరు వ్యతిరేకిస్తున్నారు కాబట్టి ఉపసంహరిస్తున్నామని చెప్పారు. రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు జరపలేదు.

యధాతథంగా ఆ చట్టాలు అమలు జరిగితే వ్యవసాయం, భూమి మొత్తం కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లిపోతుంది. రైతులు కూలీలుగా రూపాంతరం చెందుతారు. ఈ విషయం రైతుపిల్లలూ, చదువుకున్నవాళ్ళు సైతం గుర్తించకుండా ప్రభుత్వం జాగ్రత్త పడుతోంది. ఇటీవల కాలంలో అనుకుంటున్నట్టు ఇక వారంలో రెండు రోజులు పొలాలకు తీసుకెళ్లాల్సి వస్తే కూలీలుగా వెళ్ళాలి లేదా గేటులో విజిటర్స్ బాడ్జ్ వేసుకొని వెళ్లిచూడాలి. ప్రోటీన్‌తో కూడిన రైస్ అంటూ సిరిలాక్ లాంటి మేత కొనుక్కోవలసి వస్తుంది చూడండి. ఇంకెంతో దూరం లేదు అది కూడా. ఐస్ ఫ్యాక్టరీ లా రైస్ ఫాక్టరీలు వస్తాయి. వ్యవసాయ క్షేత్రాల్లో ఇక రైతు కనిపించడు. కూలీలు మాత్రమే ఉంటారు. అదే అభివృద్ధి అంటున్నారు. వేచి చూడాల్సిందే. ప్రభుత్వ విధానాలు అలా ఉన్నాయి.

ఇప్పటికే కార్పొరేట్ రంగం బాండ్ బాక్స్, డ్రై క్లీనర్స్ పేరుతో ఆ వృత్తిపై బతికే ఏటి రాజుల(రజక) ను పక్కకు నెట్టింది. బాటా, కరోనా, పాపులర్ లాంటి దిగ్గజ షూ కంపెనీలు చర్మ కారులను వృత్తినుండి బయటకు తోశాయి. రెడీమేడ్ రంగం దర్జీ వృత్తిని పక్కకు నెట్టింది. రిలయన్స్, డి మార్ట్, మోర్ లాంటి కార్పొరేట్లు చిన్న వ్యాపారులను పక్కకు నెట్టి రాజులై కూర్చున్నాయి. ఇటీవల రిలయన్స్ లాంటి సంస్థలు క్షౌర వృత్తికారుల స్థానం ఆక్రమించే పని చేస్తున్నాయి. జ్యువలరీ షాపులు స్వర్ణ కారులను పక్కన పెట్టాయి. ట్రాక్టర్లు, నాగలి బ్లేడులు, వ్యవసాయ పరికరాలతో కార్పొరేట్ కంపెనీలు వడ్రంగి, కమ్మరి బతుకులను ఛిద్రం చేశాయి. అల్యూమినియం, స్టీలు పాత్రలూ రంగంలో కొచ్చి కుమ్మరి జీవితాలకు చరమాంకం పాడాయి. చిన్ని చిన్ని పెట్టుబడులతో చిరుజీవనం సాగించే రోడ్డు వార జీవితాలు ముందు ముందు రోడ్డున పడే రోజులొచ్చాయ్.

ప్రభుత్వ, ప్రైవేటీకరణ పేరుతో గతంలో అభివృద్ధికి నోచుకోని నిమ్న వర్గాలనుకునే వారి రిజర్వేషన్‌ను హాం ఫట్ చేశాయి. ఇక ప్రైవేటు రంగంలో దాదాపు అన్నీ ఒప్పంద ఉద్యోగాలే. ఇప్పటికే రైల్వే, విద్యుత్, టెలికాం, ఐటీ తదితర రంగాల్లో ఇది అమలు జరుగుతోంది.

బ్యాంకింగ్ రంగం భ్రష్టు పట్టిపోతుంది. సామాన్యులు రూపాయి రూపాయి కూడగట్టి ఇంటి దొంగ ఎక్కడెత్తికెళ్లి మద్యం తాగి తగలేస్తాడో అని మహిళామణులు పొదుపుగా బాంకుల్లో దాచుకుంటే, బాంకులు కార్పొరేట్ దొంగలకు అప్పులివ్వటం, ప్రభుత్వాలు ఆ కార్పొరేట్ దొంగలకు రుణమాఫీలు చెయ్యటం దేనికి సంకేతమో మీరే నిర్ణయించుకోవాలి. విద్యార్థులు పోటీ పరీక్షల్లో నిలవలేని విద్యావిధానం కొనసాగుతుంది. ఆ విద్య కూడా ప్రైవేటురంగంలో లక్షలకు లక్షలు పోసి కొనుక్కోవలసి వస్తుంది. ప్రభుత్వరంగ పాఠశాలల మూతకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అయితే ఈ ప్రభుత్వమే కాదు గత ప్రభుత్వాలనుండి కొనసాగుతూనే ఉంది. దేశరక్షణ కోసం శ్రమించే వీర జవానులకు, ప్రభుత్వ రంగంలోనూ పూర్తికాలం శ్రమించిన ఉద్యోగులకు, ఉత్పత్తిరంగంలో పనిచేసి అలసి సొలసిన కార్మికవర్గానికి లేని పింఛన్లు, ఓట్లు డబ్బిచ్చి, మందుపోసి గెలిచిన కార్పొరేటర్ల నుండి మొదలు ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులు అందరికీ సేవ చేస్తున్నామని చెబుతూనే లక్షలు జీతాలు, అన్ని రకాల పింఛన్లు. ఏ స్కీము వచ్చినా ప్రారంభం నుండే స్కాములు. ఒకటేమిటి అన్ని రంగాలను మూసీనది ప్రక్షాళనలా ప్రక్షాళన చెయ్యవలసి ఉంది.

ఇవన్నీ సామాజిక చైతన్యంతో, మార్క్సిస్టు దృక్పథంతో పరిశీలిస్తేనే గాని అర్థంకాని విషయాలు. కేవలం బతుకు తెరువు పనులకు చదివే క్లాసు పుస్తకాలు ఈ విజ్ఞానం అందించలేదు. మార్క్సిజాన్ని అధ్యయనం చేయడానికి కమ్యూనిస్టే కావలసిన అవసరం లేదు. ప్రపంచ వ్యాప్తంగా, విశ్వ నరులంతా అధ్యయనం చెయ్యవలసిన మహోన్నత సిద్ధాంతం "మార్క్సిజం". అదీ భౌతిక వాద దృక్పథంతో, హేతుతత్వంతో అధ్యయనం చేస్తేనే గాని ఇటువంటి సామాజిక వర్గాలకు జరుగుతున్న అన్యాయం అర్థం కాదు. ప్రాంతాన్ని బట్టి రంగుల్లో తేడాలుండవచ్చేమో గాని మానవజాతి ఎక్కడున్నా మానవులే. ఇవే సమస్యలు ప్రపంచవ్యాప్తంగా సదరు కార్పొరేట్ శక్తులు అనేక కుయుక్తులతో లాఘవంగా తెర ముందుకు తెస్తున్నాయి. ఈ గ్రహింపు వున్న చాలా దేశాల్లో, ముఖ్యంగా లాటిన్ అమెరికన్ దేశాల్లో ఇటువంటి కుయుక్తులతో విసిగి వేసారిపోతున్న ప్రజానీకం వామపక్ష శక్తుల దన్నుతో విప్లవ కార్యాచరణకు పూనుకోవడం వింటున్నాం.

ఎవరి పోరాటం వెనుక ఉన్న శక్తిని గమనించినా ఒక్క విషయం స్పష్టం. వారికి దేశ, స్థల, కాలాల సంబంధం లేకుండా మార్క్స్ ఆలోచనా సరళితోనే సాధ్యమౌతుందని అర్థం చేసుకుంటే సమకాలీన సమాజం యావత్తూ ప్రపంచం మార్పును అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతగా వుందో తెలుసుకోవచ్చు. విశ్వం కొందరికోసం కాదు, ఇది అందరి కోసం! విశ్వం ఆ కొందరి కోసం కాదన్న విషయం తెలియాలీ అంటే మార్క్స్ ఏం చెప్పాడో చూడాలి.

మార్క్సిజం తెలియకపోతే ప్రపంచ గతి దానికదే మారుతుందని, యే అవతార పురుషుడో వచ్చి ధర్మం నాలుగు పాదాలా నడిపించే మంచి రోజులు తేక పోతాడా అని ఎదురు చూడటం లాంటిదనీ, అదీ కాకపోతే మంచి పాలకులు వచ్చి ఈ కష్టాలన్నీ తొలిగించక పోతాడా అనుకుంటూ ఉస్సురంటూ కాలం గడిపేస్తూ పోవడం తప్ప ఇంకేమీ కాదు. ఇవి ఇంచుమించు పాత రాతి యుగపు భావనల్ని నమ్మడం కంటే ఎక్కువేమీ కాదు! అందుకే విశ్వం యే పదిమంది కోసమో పుట్టింది కాదనీ ఇది అందరిదీ అని చెప్పిన మార్క్స్‌ని చదవండి! విశ్వ నరుడా మేలుకో! పోరుబాట తెలుసుకో!

- బంగారు విబి ఆచార్యులు, 9849579569.

గుజరాత్‌లో బీజేపీకి రెబల్స్ బెడద

మరో 12 మందిపై కాషాయ పార్టీ వేటు

సూరత్: గుజరాత్‌లో అధికార బీజేపీ మరో 12 మంది తిరుగుబాటు అభ్యర్థులపై వేటు వేసింది. త్వరలో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీ టికెట్లు నిరాకరించిన తర్వాత వారు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేయడంతో క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. ఈ 12 మంది రెబల్స్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టికెట్లు ఆశించినవారే. ఆదివారం ఏడుగురు రెబల్స్‌ను పార్టీ సస్పెండ్ చేసింది. తాజాగా మరో 12 మందిపై వేటు వేసింది. 'పార్టీ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నందుకు ఈ ఎమ్మెల్యేలను ఆరేళ్లపాటు సస్పెండ్ చేశాం' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సీఆర్ పాటిల్‌ను ఉటంకిస్తూ ఒక ప్రకటన విడుదలయింది. సస్పెన్షన్‌కు గురైన బీజేపీ నాయకులలో పద్రా నుంచి దినుభాయ్ పటేల్, వఘోడియా నుంచి మధుభాయ్ శ్రీవాస్తవ్, వడోదర జిల్లాకు చెందిన కుల్దీప్ సిన్హ్ రౌల్ ఉన్నారు. అలాగే, పంచమహల్ జిల్లా షహెరాకు చెందిన బి పాగి, ఆరావళి జిల్లాకు చెందిన ధవల్ సిన్హ్ ఝులా, మెహసానాకు చెందిన రామ్ సిన్హ్ ఠాకూర్‌ను కూడా సస్పెండ్ చేశారు. ఇక ఆనంద్, బనస్కాంత, మహిసాగర్ జిల్లాల్లో ఇద్దరేసి చొప్పున సస్పెండ్ చేశారు. మానవ్‌జీభాయ్ దేశాయ్, ఎల్.ఠాకూర్ బనస్కాంత నుంచి, ఎస్ఎం.ఖాంత్, జె.పి.పటేల్ మహిసాగర్ నుంచి, రమేష్ ఝులా, అమర్షి భాయ్ ఝులా ఆనంద్ జిల్లా నుంచి సస్పెండ్ అయ్యారు. గుజరాత్‌లో ఏడవసారి అధికారాన్ని ఆశిస్తున్న బీజేపీ 42 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లను నిరాకరించింది. 160 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను ప్రకటించిన పార్టీ 38 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను తొలగించింది. ఆ తర్వాత మిగిలిన అసెంబ్లీ స్థానాలకు కూడా మరో మూడు అభ్యర్థుల జాబితాలను అధికార పార్టీ ప్రకటించింది. మాజీ ముఖ్యమంత్రులు విజయ్ రూపానీ, నితిన్ పటేల్, పార్టీ అధ్యక్షుడు పాటిల్ సహా అనేక మంది పార్టీ పెద్దలు వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నారు. 2017 గుజరాత్ ఎన్నికల్లో మొత్తం 182 సీట్లకుగాను 99 స్థానాలను గెలుచుకుంది. పార్టీ గత 27 సంవత్సరాలుగా అధికారంలో ఉంది. రాష్ట్రానికి ఎక్కువ కాలం ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ పని చేశారు. ఈసారి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, సి.ఆర్.పాటిల్‌కు చెందిన పార్టీ నాయకత్వంలో అత్యధిక సీట్ల సంఖ్య 140కి మించాలనే లక్ష్యంతో ఉంది. ఏది ఏమైనప్పటికీ, అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నుంచి ఇది గట్టి ఎన్నికల సవాలును ఎదుర్కొంటుంది. ఇది ఇసుదాన్ గాధ్విని తన ముఖ్యమంత్రి అభ్యర్థిగా పేర్కొంది. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కాంగ్రెస్ కూడా తన ఉత్తమ ఎన్నికల అడుగు ముందుకు వేయాలని భావిస్తోంది. 182 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్న గుజరాత్ రాష్ట్రంలో డిసెంబర్ 1, 5 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరుగుతుంది. హిమాచల్ ప్రదేశ్ ఫలితాల తేదీతో పాటు డిసెంబర్ 8న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

ప్రచారానికి ఆ ఊరు దూరం!

రాజ్‌కోట్: ఉత్తరాదిలోని రెండు రాష్ట్రాల్లో ఎన్నికల సందడి నెలకొంది. నాయకులు బిజీ...బిజీగా, కాలంతో పరుగెడుతున్నారు. ఎక్కడ చూసినా ప్రచారం హోరెత్తిపోతోంది. ఓట్ల కోసం నాయకులు ఇంటింటికీ కాళ్లకు బలపాలు కట్టుకుని తిరుగుతున్నారు. అయితే... గుజరాత్‌లోని ఓ గ్రామంలో మాత్రం ఎన్నికల హడావుడి కనబడటం లేదు. అభ్యర్థులెవరూ ఏ ఇంటికీ వెళ్లడం లేదు. గ్రామంలో అభ్యర్థులే కనబడటం లేదు. విషయానికి వస్తే రాజ్‌కోట్‌కు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజ్ సమాధియాలా గ్రామంలో వింత పరిస్థితి ఉంది. గ్రామస్థులంతాప్రచారంపై నిషేధం విధించుకున్నారు. రాజ్‌కోట్ జిల్లాలోని రాజ్ సమాధియాలా గ్రామంలోకి రాజకీయ పార్టీల నేతలు వెళ్లేందుకు ఆ ఊరి పెద్దలు అనుమతించరు. పార్టీ నాయకులు తమ ఊరిలో ఎన్నికల ప్రచారం నిర్వహించకుండా గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ) నిషేధం విధించింది. ఇది ఈ నాటిది కాదు. నాలుగు దశాబ్దాలుగా ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు. అభ్యర్థులు తమ గ్రామంలో ప్రచారం చేస్తే తమ ప్రాంతానికి హాని జరుగుతుందని ఇక్కడి వారి విశ్వాసం. అందుకే రాజకీయ పార్టీలను ఎన్నికల ప్రచారానికి అనుమతించరు. దీనిపై గ్రామ సర్పంచి మాట్లాడుతూ.. 'మా గ్రామంలో ఎన్నికల ప్రచారం చేపట్టకుండా 1983 నుంచి నిషేధం అమల్లో ఉంది. మా విశ్వాసాల గురించి రాజకీయ పార్టీలకూ తెలుసు. అందుకే ఇక్కడ ఏ రాజకీయ పార్టీ ప్రచారం చేపట్టదు' అని తెలిపారు. అభ్యర్థుల ప్రచారం మాత్రమే కాదు.. ఇళ్లు, వీధుల్లో రాజకీయ పార్టీల బ్యానర్లు అంటించడం,

కరపత్రాలు పంచడం ఇక్కడ నిషేధమే. అయితే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడంలో ఈ గ్రామం ముందుంటుంది. గ్రామాభివృద్ధి కమిటీ రూపొందించిన నిబంధనలను గ్రామస్థులు తప్పనిసరిగా పాటించాల్సిందే. అందులో భాగంగానే.. ఓటు వేయకపోతే రూ.51 జరిమానా విధిస్తారు. దీంతో ఎప్పుడు ఎన్నికలు జరిగినా తమ గ్రామంలో దాదాపు 100శాతం ఓటింగ్ నమోదవుతుందని సర్పంచ్ తెలిపారు. తప్పనిసరి పరిస్థితిలో ఓటు వేయకలేకపోతే.. వారు ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. 1700 మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో 995 మంది ఓటర్లు ఉన్నారు. ప్రచారం లేకపోవడంతో తమకు నచ్చిన అభ్యర్థికి ఓటేస్తామని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ గ్రామంలో వైఫై, సీసీటీవీ కెమెరాల వంటి అధునాతన సౌకర్యాలు ఉన్నాయి. కేవలం ఓటెయ్యకపోవడం మాత్రమే కాదు...చెత్త బయట విసిరేసినా ఇక్కడి ప్రజలు జరిమానాలు చెల్లించాల్సిందే. ఈ గ్రామాన్ని చూసి చుట్టుపక్కల ఊర్లు కూడా ఇలాంటి నిషేధాన్ని అమల్లోకి తీసుకొచ్చాయి.

సద్దాంలా రాహుల్: అసోం సీఎం

అహ్మదాబాద్: 'నాకెందుకో... జోడోయాత్ర చేస్తున్న రాహుల్‌ను చూస్తోంటే... సద్దాం హుస్సేన్ పోలికల్లో కనిపిస్తున్నారు' అని అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఛలోక్తి విసిరారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అహ్మదాబాద్‌లో బుధవారం జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. గుజరాత్ ఎన్నికల వేళ రాహుల్ పర్యటించనున్నారా అనే ప్రశ్నకు 'గుజరాత్‌లో ఆయన కనిపించడం లేదు. విజిటింగ్ ఫ్యాకల్టీ తరహాలోనే ఆయన రాష్ట్రానికి వస్తుంటారు. హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల్లోనూ ఆయన ప్రచారం చేయలేదు. ఆయన ఎన్నికలు లేని ప్రాంతాల్లో మాత్రమే పర్యటిస్తుంటారు. బహుశా ఓటమి భయం కావచ్చు' అని శర్మ సమాధానమిచ్చారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో పాల్గొనేందుకు పెయిడ్ ఆర్టిస్టులుగా బాలీవుడ్ నటులను తెచ్చుకుంటున్నారని ఆయన ఆరోపించారు. కాగా, రాహుల్ గాంధీపై అసోం సీఎం చేసిన వ్యాఖ్యలను ఆ రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ భూపెన్ కుమార్ బోరా తిప్పికొట్టారు. 'మీరు (అసోం సీఎం) కేవలం వార్తల్లో ఉండాలనుకుంటున్నారు. రాహుల్ గాంధీ పేరు ఎత్తితేనే అది సాధ్యమవుతుంది. హిమంత్ బిశ్వ శర్మ ఏదైనా మాట్లాడతారు. అధికారం కోసం ఏదైనా చేస్తారు. ఆయనను మేము పట్టించుకోం' అని బోరా అన్నారు.

నరికి చంపుతానని బెదిరించాడు

రెండేళ్ల క్రితమే శ్రద్ధ ఫిర్యాదు

న్యూఢిల్లీ: శ్రద్ధా వాకర్ హత్యకేసులో సంచనల విషయాలు బయటకొస్తున్నాయి. తనను ముందే హత్య చేస్తాడని ఆమె భయపడినట్టు తెలుస్తోంది. దీనికి ఆమె మహారాష్ట్రలోని వసాయ్‌లో చేసిన ఫిర్యాదు బలం చేకూరుస్తోంది. దిల్లీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రద్ధా, అఫ్తాబ్ సహజీవనం చేస్తోన్న సమయంలో రెండేళ్ల క్రితం వారిద్దరి మధ్య గొడవ జరిగింది. అఫ్తాబ్ ఆమెపై చేయిచేసుకున్నాడు. ఊపిరాడకుండా చేసి, చంపాలని చూశాడని ఆ ఫిర్యాదులో శ్రద్ధా పేర్కొంది. 'నన్ను చంపి, ముక్కలు చేసి, విసిరేస్తానని బెదిరించాడు. నన్ను కొట్టి ఆరునెలలైంది. కానీ చంపేస్తానని బెదిరించడంతో ఫిర్యాదు చేసే ధైర్యం చేయలేకపోయాను' అని ఫిర్యాదులో ఆమె తెలిపింది. ఇదివరకు ఆమె మొహంపై గాయాలతో ఉన్న ఫొటో ఒకటి బయటకు వచ్చింది. అదే ఏడాది తన స్నేహితుడికి ఆమె దానిని షేర్ చేసింది. వెన్నుకు తీవ్రగాయం కావడంతో ఆమె ఆస్పత్రిలో చేరిందని స్నేహితుడు వెల్లడించాడు. అయితే ఈ రెండు ఘటనలు ఒకటేనా లేదా తెలియాల్సి ఉంది. ఆ ఫిర్యాదులో ఆమె అఫ్తాబ్ కుటుంబం గురించి ప్రస్తావించింది. 'ఇతని ప్రవర్తన గురించి అతడి తల్లిదండ్రులకు తెలుసు. వారికి మేం కలిసి ఉంటున్నామని కూడా తెలుసు. వారు అప్పుడప్పుడు మా దగ్గరకు వచ్చేవారు. మా పెళ్లికి వారి ఆశీస్సులు ఉన్నాయి' అని చెప్పిన ఆమె, అతడితో కలిసి ఉండటానికి ఇష్టం లేదని ఫిర్యాదులో పేర్కొంది. అయినప్పటికీ.. శ్రద్ధా అతడితోనే ఎందుకు కలిసుందనే దానిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2020లో మహారాష్ట్రలో ఆమె ఇచ్చిన ఫిర్యాదు గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. దానిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో దర్యాప్తు చేస్తున్నారు.

మరో వివాదంలో ఆప్ మంత్రి

న్యూఢిల్లీ: మొన్న మసాజ్ వీడియో... నేడు ఫుడ్ ఫుటేజ్... ఆప్ మంత్రి సత్యేందర్ జైన్ చిక్కుల్లో పడ్డారు. ఇవి వివాదాస్పదంగా మారుతున్నాయి. మత విశ్వాసాలకు అనుగుణంగా తనకు తగిన ఆహారం అందించడం లేదని జైన్ కోర్టును ఆశ్రయించిన సమయంలో... మరో వీడియో వెలుగులోకి వచ్చింది. మంత్రి జైలు గది సీసీటీవీ దృశ్యాల్లో ఆయనకు సలాడ్లు, పండ్లు, ఇతర ఆహారం అందుతున్నట్లు కనిపిస్తోంది. ఈ ఫుటేజ్ .. జైన్ ఆరోపణలను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చుతోందని జైలు వర్గాలు వ్యాఖ్యానించాయి. ఆయన చెబుతున్నట్టు 28కేజీలు తగ్గలేదని, పైగా 8 కేజీలు పెరిగారని పేర్కొన్నాయి. తన విశ్వాసాలకు అనుగుణంగా తనకు ఆహారం అందించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోర్టును ఆశ్రయించారు. తాను అరెస్టయిన దగ్గరి నుంచి జైలు అధికారులు ఆహారం, ఔషధాలు నిరాకరిస్తున్నారని మంత్రి పిటిషన్‌లో పేర్కొన్న సంగతి తెలిసిందే. ఇదివరకు మసాజ్ వీడియో బయటకు రాగా.. అందులో మర్దనా చేస్తోన్న వ్యక్తి ఫిజియోథెరపిస్టు కాదని, రేపిస్టు అని జైలు వర్గాలు వెల్లడించిన సంగతి తెలిసిందే. దీనిపై బీజేపీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. 'జైన్‌కు మర్దన చేసిన వ్యక్తి ఫిజియోథెరపిస్టు కాదు. ఒక రేపిస్టు. దీనిని కూడా ఆప్ సమర్థించుకుంటుందా..? వారు తీహార్‌ను థాయ్‌లాండ్‌గా మార్చుకున్నారు' అని బీజేపీ మండిపడింది.

'సుప్రీం'లో నాలుగు కొత్త బెంచ్‌లు

న్యూఢిల్లీ: ఇకపై క్రిమినల్ అంశాలు, ప్రత్యక్ష–పరోక్ష పన్నులు, భూ సేకరణ, వాహన ప్రమాదాల క్లెయిమ్‌లు వంటి కేసులకు సంబంధించి సుప్రీం కోర్టులో విచారణ నిమిత్తం కొత్త బెంచ్‌లను వచ్చే వారం నుంచి ఏర్పాటు చేయనున్నారు. ఈ విషయాన్ని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ వెల్లడించారు. ఓ కేసుకు సంబంధించి అత్యవసరంగా విచారణ చేపట్టాలని ఓ న్యాయవాది చేసిన అభ్యర్థనకు సీజేఐ స్పందిస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు. వచ్చేవారం ఏర్పడే ప్రత్యేక బెంచ్ ఎదుటకు ఆ కేసును తీసుకెళ్లాలని సూచించారు. తనకు తెలిసినంత వరకు జస్టిస్ సూర్యకాంత్ బెంచ్ భూసేకరణకు సంబంధించిన కేసులను విచారిస్తుందని వెల్లడించారు. ఇక ప్రత్యక్ష–పరోక్ష పన్నులకు సంబంధించిన కేసులను బుధ, శుక్రవారాల్లో స్పెషల్ బెంచ్ విచారించనుంది. ఈ కొత్త బెంచ్‌ల ఏర్పాటుతో పెండింగ్ కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని న్యాయశాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

నేను మరణించినా...నిరసన ఆపొద్దు

రైతునేత జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ పిలుపు

చండీగఢ్: రైతుల వివిధ డిమాండ్ల కోసం భారతీ కిసాన్ యూనియన్ (ఏక్తా సిద్ధూపూర్) అధ్యక్షుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష బుధవారం ఐదో రోజుకు చేరుకుంది. జాతీయ రహదారి ప్రాజెక్టుల కోసం సేకరించిన భూమికి గాను నిర్వాసిత రైతులకు, ప్రతికూల వాతావరణంతో పాటు తెగుళ్ల దాడితో పంట నష్టపోయిన రైతులకు మెరుగైన నష్ట పరిహారం ఇవ్వాలని, వరి దుబ్బులు తగలబెట్టినందుకు విధించిన భారీ జరిమానాలను రద్దు చేయాలని దల్లేవాల్ పంజాబ్‌లోని ఫరీద్‌కోట్‌లో గత శనివారం ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభించారు.

బుధవారం ఫరీద్‌కోట్‌లోని దీక్షా స్థలిలో దల్లేవాల్ మీడియాతో మాట్లాడుతూ... 'నేను చనిపోయినా, శాంతి యుత పద్ధతిలో తమ నిరసనలు చేపట్టాలని రైతు సహచరులకు విజ్ఞప్తి చేస్తున్నాను' అని అన్నారు. నిరాహారదీక్ష కారణంగా బరువు కోల్పోవడం, రక్తపోటులో హెచ్చు తగ్గులు, రక్తంలో చక్కెర స్థాయి తగ్గడం ప్రస్తుతానికి తన మనస్సును బాధపెట్టడం లేదని ఆయన చెప్పారు. ఇప్పటికే ఆమోదించిన డిమాండ్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయాలని, పంట దుబ్బులను తగులబెట్టినందుకు విధించిన జరిమానాలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కాగా దల్లేవాల్ ఆరోగ్యాన్ని పర్యవేక్షించేందుకు వైద్య బృందం ఫరీద్‌కోట్‌లోని దీక్షా స్థలిలోనే ఉంది. అంతకుముందు

దల్లేవాల్‌కు పరీక్షలు చేసిన వైద్యులు, ఆయన రక్తంలో చక్కెర స్థాయి తక్కువగా ఉందని చెప్పారు.

జిల్లా యంత్రాంగం, పోలీసు ఉన్నతాధికారులు దల్లేవాల్ నిరాహార దీక్షను విరమింపజేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రైతులపై చేసిన వ్యాఖ్యలకు గాను ముఖ్యమంత్రి భగవంత్ మాన్ రైతులకు క్షమాపణ చెప్పాలని దల్లేవాల్ డిమాండ్ చేశారు. తమ నిరసనల్లో భాగంగా పంజాబ్‌లో తరచూ రోడ్లను దిగ్బంధించినందుకు రైతు సంఘాలను మాన్ విమర్శించారు. తమ నిరసనలు తప్పయితే దిల్లీ సరిహద్దుల్లో వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో ఆప్ నేతలు ఎందుకు పాల్గొన్నారని దల్లేవాల్ ప్రశ్నించారు. కాగా రైతుల ఆందోళన బుధవారానికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. పంజాబ్‌లోని అమృత్‌సర్, మాన్సా, పాటియాలా, ఫరీద్‌కోట్, బటిండాలో నిరసనలకు బీకేయూ (ఏక్తా సిద్ధూపూర్) నాయకత్వం వహిస్తోంది.

గెలిస్తే... మీరట్‌కు గాడ్సే పేరు

హిందూ మహాసభ బరితెగింపు

మీరట్(ఉత్తరప్రదేశ్): ఉత్తరప్రదేశ్‌లో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి హిందూ మహాసభ ఓ మేనిఫెస్టో విడుదల చేసింది. దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చడమే తమ లక్ష్యమని, గోమాతను కాపాడుకుంటామని మేనిఫెస్టోలో పేర్కొంది. నగరపాలక సంస్థ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి మేయర్ అయితే మీరట్‌ను నాథూరాం గాడ్సే నగర్‌గా మారుస్తామని ప్రకటించింది. నగరంలో ఉన్న ముఖ్యప్రదేశాల పేర్లకు సైతం హిందూ నేతల పేర్లు పెడతామని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు పండిట్ అశోక్‌శర్మ తెలిపారు. నగరపాలక సంస్థలో అన్ని వార్డులకూ పోటీ చేస్తున్నామని, దేశభక్తి కలిగిన వారికే అవకాశం ఇస్తామని హిందూ మహాసభ మీరట్ జిల్లా అధ్యక్షుడు అభిషేక్ అగర్వాల్ తెలిపారు. బీజేపీ, శివసేనపై విమర్శలు గుప్పించారు. 'బీజేపీ హిందూ పార్టీ అయినప్పటికీ ఆ పార్టీలో ఇతర వర్గాల సంఖ్య పెరిగింది. శివసేన సైతం ఒక వర్గాన్ని సంతృప్తి పరిచేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఆ రెండు పార్టీలూ వాటి సిద్ధాంతాలకు దూరమవుతున్నాయి' అని విమర్శించారు.

ఆ నిర్ణయం లోక్‌సభ స్పీకర్‌దే!

న్యూఢిల్లీ: పార్లమెంటు శీతాకాల సమావేశాలు ఎక్కడ నిర్ణయించాలో లోక్‌సభ స్పీకర్ నిర్ణయిస్తారని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కౌశల్ కిషోర్ తెలిపారు. కొత్త పార్లమెంట్ భవనాని (సెంట్రల్ విస్టా ప్రాజెక్టు)కి తుది మెరుగులు దిద్దే పనులు జరుగుతున్నాయని, రాబోయే శీతాకాల సమావేశాలు కొత్త భవనంలోనా లేక ప్రస్తుత భవనంలోనే అనేది లోక్‌సభ స్పీకర్ నిర్ణయిస్తారని ఆయన చెప్పారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 7న ప్రారంభమై డిసెంబర్ 29న ముగుస్తాయి. నవంబర్ ఆఖరుకు సెంట్రల్ విస్టా ప్రాజెక్టు పూర్తి చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అయితే ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయని, వీలైనంత త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని కేంద్ర మంత్రి కిషోర్ పేర్కొనడం గమనార్హం. సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్ ఎప్పుడు పూర్తవుతుందన్న విషయమై ప్రభుత్వం ప్రకటన చేయవలసి ఉందని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రి హర్దీప్ సింగ్ పూరి ఈ నెల మొదట్లో తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన కొత్త పార్లమెంట్ భవన నిర్మాణానికి 2020 డిసెంబర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ ఈ భవనాన్ని నిర్మిస్తోంది.

శానిటరీ నాప్కిన్స్‌తో క్యాన్సర్ ముప్పు

- హానికర రసాయనాలతో తయారీ
- టాక్సిక్ లింక్ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: భారత్‌లో కొన్ని పేరున్న కంపెనీల శానిటరీ నాప్కిన్స్‌తో అమ్మాయిలకు క్యాన్సర్ ముప్పు పొంచివున్నట్లు ఒక అధ్యయనంలో వెల్లడైంది. క్యాన్సర్‌తో పాటు గుండె సమస్యలు, మధుమేహం, ఆస్తమా, అంగవైకల్యం, సంతానోత్పత్తి సమస్యలు రావచ్చు హెచ్చరించింది. ఈ అధ్యయనాన్ని దిల్లీకి చెందిన ఎన్జీవో 'టాక్సిక్ లింక్' నిర్వహించింది. 'మెనుస్ట్రల్ వేస్ట్ 2022' పేరుతో నివేదికను ప్రచురించింది. ఇందులో నాప్కిన్స్‌ను వినియోగదారులు మెచ్చే విధంగా తయారు చేసేందుకు కంపెనీలు ఎంతో హానికరమైన రసాయనాలు వినియోగిస్తున్నట్లు వెల్లడించింది. థాలేట్స్, వలటైల్ ఆర్గానిక్ కంపౌండ్స్ (వీఓసీ) అధిక రెట్లు ఉన్నట్లు మార్కెట్‌లో లభించే ఆరు ఇన్ ఆర్గానిక్, నాలుగు ఆర్గానిక్ న్యాప్కిన్స్‌వి 10 నమూనాలు పరీక్షించి తేల్చింది. థాలేట్స్ అధికంగా ఉండటం వల్ల ఈ నాప్కిన్స్‌ను వినియో గించే వారికి ఎండోక్రైన్ (అంతస్రావ) సమస్యలు రావచ్చునని, గుండె, గర్భ వ్యవస్థలపై ప్రభావం ఉండటమే కాకుండా మధుమేహం, కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చేందుకు అవకాశం ఉంటుందని వెల్లడించింది. ఆర్గానిక్ ప్యాడ్లని చెప్పుకునే వాటిలోనూ డీఐడీపీ (ఒక ఒకరమైన థాలేట్) గరిష్ఠంగా 19,460 ఎంజీలు ఉన్నదని పేర్కొంది. ఆర్గానిక్‌లో 0.0321, ఇన్ ఆర్గానిక్‌లో 0.0224 గ్రాముల లెక్కన థాలేట్లు ఉన్నట్లు తెలిపింది. మొత్తం 25 రకాల వలటైల్ ఆర్గానిక్ కంపౌండ్లు (ఎసిటోన్, క్లోరోఫామ్, బెంజీన్, టోలునె తదితరాలు) నాప్కిన్స్‌లో ఉన్నట్లు పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ఒకసారి వినియోగానికి అనువైన నాప్కిన్స్‌కు గిరాకీ ఎక్కువ అని, రుతుస్రావం వయస్సులో ఉన్నవారు తమ జీవిత కాలంలో సగటున 1,800 రోజులు వీటివి వినియోగిస్తారని తెలిపింది. నాప్కిన్స్‌లో సింథటిక్ ప్లాసిక్ ఉన్నట్లు ఈమధ్య కాలంలో జరిగిన కొన్ని అధ్యయనాల్లో వెల్లడైందని పేర్కొంది. డీఐబీపీ, డీబీపీ, డీఐఎన్‌పీ, డీఐడీపీ తదితర థాలేట్ల శాతాన్ని అంచనా వేసేందుకు ఈ అధ్యయనం జరిగింది. అదే సమయంలో వినియోగదారుల ఆరోగ్యానికి హానికలిగించని ఉత్పత్తుల అందుబాటులోకి వచ్చేలా కొన్ని సిఫార్సులు చేసింది. తయారీ కంపెనీలకు తగిన మార్గదర్శకాలు, ప్రామాణాలను సూచించాలని ప్రభుత్వాలను కోరింది. నాప్కిన్స్‌లో వినియోగించే వస్తువులను ప్యాక్‌పై ప్రకటించేలా నిబంధన తేవాలని, సరైన సమాచారం అందజేస్తూ తగిన హెచ్చరికలు చేసేలా ప్రకటనలు ఉండాలని సూచించింది. ఈ ఉత్పత్తుల్లో హానికరమైన రసాయనాల వినియోగానికి నిరోధిస్తూ వాటి స్థానంలో వినియోగదారునికి హాని తలపెట్టనివి వాడాలని పథకాలు తేవాలని అధ్యయనం సిఫార్సు చేసింది.

అసోంలో 200కు పైగా ఇళ్లు దగ్ధం

దిస్‌పూర్: అసోంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 200కు పైగా ఇళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదం కర్బీ అంగ్లాంగ్ జిల్లాలో బుధవారం చోటుచేసుకుంది. ప్రమాదానికి గల కారణాలు ఇంతవరకు తెలియరాలేదు. దిమాపూర్, బోకజాన్ ప్రాంతాల నుంచి అగ్నిమాపక వాహనాలు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చాయి. అసోం–నాగాలాండ్ సరిహద్దులోని కర్బీ అంగ్లాంగ్ జిల్లాలోని బోకాజన్ ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 200 కు పైగా ఇళ్లు, దుకాణాలు దగ్ధమయ్యాయి. ఇళ్లలోని గ్యాస్ సిలిండర్లు పేలడంతో మంటలు మరింత ఉధృతంగా ఎగసిపడ్డాయి. మంటలకు బైకులు, కార్లు ఆహుతయ్యాయి. ఇళ్లలోని నగదు, ఆహారవస్తువులు, దుస్తులు, ఇతర విలువైన డాక్యుమెంట్లు మంటల్లో కాలిబూడిదయ్యాయి. ప్రమాదంలో ఎంత నష్టం జరిగిందో ఇప్పుడే చెప్పలేమని అధికారులు తెలిపారు. పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు. అయితే, షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నికీలలు సంభవించాయని పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఈ జిల్లాలో ఇలాంటి అగ్నిప్రమాదాలు జరగడం సర్వసాధారణమైపోయాయి. ఈ ఏడాది జూన్ నెలలో జెంగా బజార్ ప్రాంతంలో, అక్టోబర్‌లో గోలాఘాట్ ప్రాంతంలో కూడా భారీ అగ్నిప్రమాదాలు సంభవించాయి.

14 శాతం పరిశ్రమల మూత

- వ్యాపారం నుంచి వైదొలగిన ఎంఎస్ఎంఈలు
- పరపతి సంపాదించలేక దయనీయస్థితిలోకి..
- కరోనా కాలంలో ఫలించని కేంద్ర ప్రభుత్వ చర్యలు
- 'గేమ్' సర్వే నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: కరోనా కాలంలో చిన్న పరిశ్రమల రంగం చావుబతుకుల మధ్య పెద్ద పోరాటం చేసింది. చాలా వరకూ తమను తాము నిలదొక్కుకునేందుకు శాయశక్తులా ప్రయత్నాలు చేశాయి. సూక్ష్మ పరిశ్రమలకు పరపతి ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో అవన్నీ దయనీయస్థితిలోకి వెళ్లిపోయాయి. తగినన్ని పొదుపు నిల్వలు లేకపోవడం, క్రెడిట్ పైనే ఆధారపడటం కూడా వ్యాపారాల నుంచి వైదొలగడానికి ప్రధాన కారణం. చిన్న, మధ్యతరహా, సూక్ష్మ పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)లను కాపాడేందుకు బ్యాంకు మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు, బ్యాంకింగ్ కరస్పాండెంట్లకు పరపతి పంపిణీ వ్యవహారాల్లో మరింత ఎక్కువగా అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని 'గేమ్' (గ్లోబల్ అలయెన్స్ ఫర్ మాస్ ఎంట్రప్రెన్యూర్షిప్) సహ వ్యవస్థాపకుడు రవి వెంకటేశన్ తన నివేదికలో పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, బ్యాంకుల లక్ష్యాలపై వారిలో అవగాహన పెంపొందించాల్సి రావడం అత్యంత విచారకరమని అన్నారు. 38 శాతం ఎంఎస్ఎంఈలకు పొదుపు నిల్వ మొత్తాలు నిలదొక్కుకునే స్థాయిలో లేకపోవడం, శాశ్వత ప్రాతిపదికపై నికరమైన ఖాతాదారులు లేకపోవడం కూడా ఆయా పరిశ్రమలు మూతపడటానికి మరో కారణంగా 'గేమ్' సర్వే తెలిపింది. దేశంలో కరోనా విజృంభించిన కాలంలో 14 శాతం చిన్న, మధ్యతరహా పరిశ్రమలు శాశ్వతంగా వ్యాపారం నుంచి వైదొలగాయని తాజా అధ్యయన నివేదిక వెల్లడించింది. కరోనా విజృంభణ వల్ల ఆర్థికంగా కుటుంబాలు చితికిపోయి కొనుగోలు శక్తి కోల్పోవడంతో ఆయా పరిశ్రమల వ్యాపారం క్షీణస్థాయికి దిగజారడంతో పాటు రాత్రికిరాత్రే దుకాణాలు మూతబడి వినియోగదారులు బజార్లకు రావడం మానేయడం ఈ యూనిట్లు మూతపడటానికి ప్రధాన కారణమని ఆ నివేదిక తెలిపింది.

మరోవైపు కోట్లాదిమంది అసంఘటిత రంగ కార్మికులు, తాత్కాలిక ఉద్యోగులు అర్ధాంతరంగా పనులు వదిలేసి ఒక ప్రవాహంలాగా సొంత గ్రామాలకు కాలినడకన పయనమైన పరిస్థితులు కూడా ఎంఎస్ఎంఈ రంగాన్ని గట్టిగా దెబ్బ తీశాయి. నగదు ప్రవాహం పూర్తిగా దెబ్బతినడంతో వ్యాపారాలు సాగలేదు. దాంతో 14 శాతం పరిశ్రమలు శాశ్వతంగా వ్యాపారం నుంచి వైదొలగాయి. 2020 మార్చిలో కఠినమైన లాక్‌డౌన్ ఆంక్షలు అమలయ్యాయి. అత్యవసర సర్వీసులు మినహా సేవారంగం పూర్తిగా మూతపడిపోయింది. దీంతో చిన్న పరిశ్రమల రంగం చావుబతుకుల మధ్య పెద్ద పోరాటం చేసింది. కేంద్ర ప్రభుత్వం ఈ రంగం నిలదొక్కుకోవడానికి అనేక చర్యలు తీసుకున్నప్పటికీ అవి ఫలించలేదు. సూక్ష్మ స్థాయి పరిశ్రమలు రెండేళ్ల లాక్‌డౌన్ ఒడిదుడుకులను తట్టుకుని నిలబడలేకపోయాయి. 40 శాతం మేరకు సూక్ష్మ పరిశ్రమలకు తగినన్ని పొదుపు నిల్వలు లేకపోవడం, క్రెడిట్‌పైనే ఆధారపడటం కూడా వ్యాపారాల నుంచి వైదొలగడానికి ప్రధాన కారణం. 92 శాతం చిన్న పరిశ్రమలు స్నేహితులు, కుటుంబసభ్యులను ఆర్థిక సహాయం అడిగి సమకూర్చుకునే ప్రయత్నాలు చేశాయి. అయితే 33 నుంచి 41 శాతం సూక్ష్మ పరిశ్రమలకు పరపతి ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో అవన్నీ దయనీయస్థితిలో మూతబడిపోవడం దురదృష్టకరం. చాలా వరకూ తమను తాము కరోనా మహమ్మారి సమయంలో నిలదొక్కుకునేందుకు శాయశక్తులా ప్రయత్నాలు చేశాయి. కొన్ని యాజమాన్యాలు కార్మికులను నిలబెట్టుకోవడంకోసం వారి అవసరాలకు అడ్వాన్సు చెల్లింపులు కూడా చేశాయి. చిన్న పరిశ్రమల్లో పనిచేసేవారిలో 55 శాతం మంది మహిళలే ఉన్నారు. 34 శాతం సూక్ష్మ యూనిట్లను మహిళలే నడుపుతున్నారు. పురుషులకంటే స్త్రీలే వీటిని చక్కగా, వ్యాపార పరంగా నడుపుతూ వచ్చారని నివేదిక పేర్కొంది.

పరపతిలో బ్యాంకుల వైఫల్యం?

సకాలంలో, సరైన సమయంలో ఎంఎస్ఎంఈలను ఆదుకోలేకపోవడం బ్యాంకుల వైఫల్యంగానే 'గేమ్' నివేదిక పరోక్షంగా తప్పుపట్టింది. ప్రభుత్వ పథకాలు, బ్యాంకులు ప్రత్యేకించి ఎంఎస్ఎంఈల కోసం నిర్దేశిత పరపతి విధానాల గురించి కేవలం 31 శాతం మందికి మాత్రమే అవగాహన ఉండటం, మిగిలిన వారికి ప్రభుత్వం అవగాహన పెంపొందించకపోవడం మరొక దురదృష్టకరమైన విషయమని 'గేమ్' సర్వే నివేదిక వెల్లడించింది. ఎంఎస్ఎంఈలకు ఆత్మనిర్భర్ పథకం కింద పరపతి ఉత్పత్తిని ప్రవేశపెట్టారు. పరిశ్రమలు తమ రుణాలను బ్యాంకులకు చెల్లించలేకపోతే ఉపయోగపడేవిధంగా దీనిని రూపొందించారు. అదేవిధంగా మార్కెట్ నుంచి ఎదురయ్యే సవాళ్లు ఎదుర్కోవడానికి కూడా వాటికి ఆర్థికపరమైన వెసులుబాటు సృష్టించారు.

బీజేపీని తరిమికొట్టండి

వైసీపీని బంగాళాఖాతంలో కలపండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని, రాష్ట్రంలో వైసీపీని బంగాళాఖాతంలో కలపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం ఏలూరు జిల్లా సీపీఐ సమితి విస్తృత స్థాయి సమావేశం స్థానిక రోటరీ క్లబ్ కమ్యూనిటీ హాలులో జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షతన జరిగింది. సీపీఐ జెండాను రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం 2019 ఎన్నికలలో రెండవసారి అధికారం చేపట్టిన తర్వాత ప్రధానంగా ఆర్ఎస్ఎస్ అజెండా అమలు చేస్తోందని విమర్శించారు. బీజేపీ మతోన్మాద, అభివృద్ధి నిరోధక పార్టీ అని, దేశంలో మైనారిటీలను భయభ్రాంతులకు గురి చేస్తోందని తెలిపారు. ప్రమాదకర రాజకీయాలు చేస్తూ తమకు వ్యతిరేకంగా ఉన్న ప్రభుత్వాలను కూల్చడం, ప్రశ్నిస్తున్న వారిపై ఐటీ దాడులు చేయిస్తూ మోదీ ప్రభుత్వం విధ్వంసక పరిపాలన సాగిస్తోందన్నారు. తొమ్మిది రాష్ట్రాలలో ఫిరాయింపులను ప్రోత్సహించడం ద్వారా ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చి బీజేపీ దొడ్డిదారిన అధికారం చేపట్టిందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడంలో సీపీఐ కీలకపాత్ర పోషించేందుకు నడుం బిగించాలని కోరారు. కమ్యూనిస్టుల పునరేకీకరణ జరగాలని, లౌకిక శక్తులు, ప్రజాతంత్ర వాదులను కలుపుకొని రాబోయే ఎన్నికలలో బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించాలని ఆయన పిలుపు ఇచ్చారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ పాలనను గాలికి వదిలేశారని విమర్శించారు. గత మూడున్నర సంవత్సరాల కాలంలో ప్రజలు, రాజకీయ పార్టీల వద్ద నుంచి ఒక్క విజ్ఞాపన పత్రం కూడా తీసుకోని అసమర్థ ముఖ్యమంత్రి జగన్ అని ఎద్దేవా చేశారు. కొత్త పరిశ్రమలు, ప్రాజెక్టులు నిర్మించలేని అసమర్ధ ప్రభుత్వం అన్నారు. రాష్ట్రంలో తన సొంత బ్రాండ్ల మద్యాన్ని విస్తృతంగా విక్రయిస్తూ కోట్లాది రూపాయలను వెనకేసుకుంటున్నారన్నారు. ఇసుకకు కృత్రిమ కొరత సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. అపరిష్కృతంగా ఉన్న విభజన సమస్యలు, ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారం, వెనుకబడిన ఉత్తరాంధ్రకు ప్రత్యేక నిధులు, కడప ఉక్కు కర్మాగారం తదితర సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసే దమ్మూధైర్యం జగన్‌కు లేవన్నారు. జగన్ తనపై ఉన్న కేసులకు భయపడి విశాఖ ఉక్కుపై కనీసం నోరు మెదపకుండా మోదీ వద్ద మోకరిల్లుతున్నారన్నారు. ఇటీవల జరిగిన సీపీఐ జాతీయ, రాష్ట్ర మహాసభలలో సీపీఐ శ్రేణులకు ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. మహాసభలను స్ఫూర్తిగా తీసుకొని అన్ని శాఖలు పార్టీ బలోపేతం పై దృష్టి సారించాలన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ కమ్యూనిస్టుల బలోపేతంతోనే రాష్ట్రానికి విముక్తి అని, అప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. పార్టీలో యువజన, విద్యార్థి విభాగాలను పటిష్టం చేయడం ద్వారా పార్టీని బలోపేతం చేయాలన్నారు. రైతు సమస్యలపై కార్యాచరణ రూపొందించి రైతు ఉద్యమం చేపట్టాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ మాట్లాడుతూ 2024లో బీజేపీని ఓడించకపోతే దేశంలో ఆర్ఎస్ఎస్ రాజ్యాంగం అమలు జరుపుతారని అన్నారు. రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ ఒంగోలులో జరగబోయే ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. పార్టీ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ డిసెంబర్ 26వ తేదీ నాటికి భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి కావస్తుందని, వాడవాడలా ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో రైతు, విద్యార్థి యువజన సంఘాలలో కమిటీలు వేయాలన్నారు. ఈ సమావేశంలో పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల వెంకటేశ్వరరావు, పుప్పాల కన్నబాబు, బాడిస రాము, సన్నేపల్లి సాయిబాబా, కారం దారయ్య, కంచర్ల గురవయ్య, జమ్మి శ్రీనివాసరావు, కొండేటి బేబి, సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యవర్గ సభ్యులు సీతారాం ప్రసాద్, జిల్లా సమితి సభ్యులు, పట్టణ, మండల శాఖా కార్యదర్శులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వియత్నాం అధ్యక్ష భవనంలో జరిగిన ప్రపంచ శాంతి మండలి సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి, అయిప్సో ప్రధాన కార్యదర్శి పల్లవ్‌సేన్ గుప్తా. వేదికపై వియత్నాం అధ్యక్షుడు యంగుయన్ తదితరులు

ఎస్సీ హాస్టళ్లలో బయటివారిని సాగనంపండి

అధికారులకు మంత్రి 'మేరుగు' ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎస్సీ హాస్టళ్లలో అక్రమంగా ఉంటున్న బయటివారిని హాస్టళ్ల నుంచి సాగనంపడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఎస్సీ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గురుకులాల్లో విద్యార్థులకు ముఖ హాజరు విధానాన్ని ప్రవేశ పెట్టాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో బయటివాళ్లు తిష్టవేసారనే ఫిర్యాదులు వస్తున్నాయని, వారివల్ల విద్యార్థులతో పాటు సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. హాస్టళ్లలో విద్యార్థులు తప్ప బయటి వ్యక్తులు ఎవరూ ఉండకూడదని స్పష్టంచేశారు. తొలుత విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి, హాస్టల్ విద్యార్థులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఖాళీగా ఉన్న వాచ్‌మేన్ల నియామకానికి చర్యలు చేపట్టాలన్నారు. గురుకులాల్లో సిబ్బందికి అమలు చేస్తున్న ముఖ ఆధారిత హాజరు విధానాన్ని విద్యార్థులకు కూడా వర్తింపజేయాలని సూచించారు. మూడు దశల్లో మొత్తం 3013 హాస్టళ్ల నిర్మాణానికి రూ.3364 కోట్లు సీఎం జగన్ మంజూరు చేసినట్టు చెప్పారు. శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించి, వాటి స్థానంలో కొత్త భవనాలను నిర్మించడానికి ప్రతిపాదనలు తయారవుతున్నాయని వివరించారు. సాంఘిక సంక్షేమశాఖ సంచాలకులు కాటి హర్షవర్ధన్, గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి పావనమూర్తి, అకడమిక్ మానిటరింగ్ అధికారి సంజీవరావు, ఎస్సీ హాస్టళ్ల ఉప సంచాలకులు లక్ష్మీసుధ, సాంకేతిక విభాగం అధికారి యోగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బెంగాల్ గవర్నర్‌గా ఆనంద బోస్ ప్రమాణం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా సీవీ ఆనంద బోస్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని రాజ్‌భవన్‌లో కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రకాశ్ శ్రీవాత్సవ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, కేబినెట్ సభ్యులు, మాజీ గవర్నర్ గోపాల్ కృష్ణ గాంధీ, వామపక్ష సంఘటన చైర్‌పర్సన్ బిమన్ బోస్ తదితర ప్రముఖులు కార్యక్రమానికి హాజరయ్యారు. బోస్‌కు పదవీ బాధ్యతలను మణిపూర్ గవర్నర్ లా గణేశన్ అప్పగించారు. బోస్ 1977 బ్యాచ్ ఐఏఎస్ అధికారి కాగా కేంద్రప్రభుత్వ కార్యదర్శిగా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా, యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా అనేక పదవుల్లో పనిచేశారు. కేరళ, తమిళనాడుతో పాటు అనేక రాష్ట్రాల్లో రాజ్‌భవన్‌లకు రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య వివాదాల వేళ పశ్చిమ బెంగాల్ గవర్నర్ బాధ్యతలను బోస్ చేపట్టడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి ప్రతిపక్ష నేత సువేందు అధికారి గైర్హాజరు కావడం వివాదానికి దారితీసింది. ప్రమాణ స్వీకారోత్సవంలో సీట్ల కేటాయింపుపై సామాజిక మాధ్యమం ద్వారా అధికారి అభ్యంతరం వ్యక్తం చేశారు.

వైద్య ఉద్యోగులకు పెండింగ్ డీఏలు చెల్లించాలి

ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) ఉద్యోగులకు పెండింగ్‌లోనున్న రెండు డీఏలతోపాటు పీఆర్సీ బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జి.ఓబులేసు డిమాండ్ చేశారు. గొల్లపూడి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీ యూసీ) రాష్ట్ర సమితి సమావేశాన్ని రాష్ట్ర అధ్యక్షుడు వి.బాలయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఓబులేసు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఏపీవీవీపీ విభాగం ఉద్యోగులకు జీవో 010 పద్దు కింద జీతభత్యాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చి, మూడేళ్లు గడుస్తున్నప్పటికీ...ఇంతవరకు రద్దు చేయ లేదని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.గిరిబాబు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, వారికి 100శాతం జీతం చెల్లించాలని, వైద్యవిధాన పరిషత్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగులకు నాలుగు నెలల వేతనాలు చెల్లించాలన్నారు. ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌వోలకు అదనపు హెచ్ఆర్సీ చెల్లించాలని, థియేటర్ అసిస్టెంట్ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏపీవీవీపీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, అప్కాస్‌లో చేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర సమస్యల్ని తక్షణమే పరిష్కరించలన్నారు. ఈ సమస్యల్ని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.బాలరాజు నాయుడు, నాయకులు పి.అప్పారావు, బి.స్వామి బాబు, సాయి సత్యనారాయణ పాల్గొన్నారు.

కన్న కొడుకే కాటేశాడు!

తల్లిదండ్రులు సహా నలుగురు కుటుంబసభ్యుల దారుణ హత్య

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ మహానగరంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఓ యువకుడు... తన కుటుంబం మొత్తాన్ని కిరాతకంగా హత మార్చిన ఘటన కలకలం రేపింది. తన తండ్రిసహా కుటుంబంలోని ఆడవాళ్లందరినీ కన్నకొడుకే కడతేర్చాడు. ఢిల్లీలోని పాలంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. తండ్రి, అమ్మమ్మ, ఇద్దరు చెల్లెళ్లను దారుణంగా హతమార్చాడు ఆ యువకుడు. నట్టింట్లో రక్తపు మడుగులో పడిఉన్న మృతదేహాలను చూసిన స్థానికులు హడలిపోయారు. బుధవారం తెల్లవారు జామున పాలం ప్రాంతానికి చెందిన యువకుడు.. తన తండ్రి, ఇద్దరు సోదరీమణులు, నానమ్మను విచక్షణారహితంగా కొట్టి నరికి చంపినట్లు పోలీసులు తెలిపారు. రక్తపు మడుగులో పడిఉన్న వారిని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు... నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు కేశవ్ (25) గా గుర్తించారు. అతను మాదకద్రవ్యాల (డ్రగ్స్)కు బానిసయ్యాడని, ఇటీవలనే మాదకద్రవ్యాల పునరావాస కేంద్రం నుంచి తిరిగి వచ్చాడని పేర్కొంటున్నారు. కుటుంబసభ్యులతో గొడవపడి నిందితుడు కేశవ్... తల్లిదండ్రులు, సోదరి, అమ్మమ్మలను కత్తితో పొడిచి చంపినట్లు పోలీసులు తెలిపారు. మృతిచెందిన ముగ్గురు మహిళల్లో ఒకరు ఇంటి గ్రౌండ్ ఫ్లోర్‌లో పడి ఉండగా, మరో రెండు మృతదేహాలను బాత్‌రూమ్‌లో గుర్తించామని పోలీసులు వెల్లడించారు. అయితే హత్యలకు గల కారణం ఇంకా తెలియరాలేదని చెప్పారు.

ఆసక్తి రేపుతున్న 'కస్టడీ'



హైదరాబాద్: టాలీవుడ్ యువ నటుడు నాగ చైతన్య, తమిళ డైరెక్టర్ వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ చిత్రం చైతన్య కెరీర్‌లో 22వది. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, టైటిల్‌ని చైతన్య పుట్టిన రోజు సందర్భంగా నిర్మాతలు విడుదల చేశారు. ఈ సినిమాకి 'కస్టడీ' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. విడుదలైన కొద్దిసేపటికే ఈ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. అందులో చైతన్య పోలీసు డ్రెస్‌లో ఉన్నాడు. అయితే.. ఆయన చుట్టూ చాలా మంది పోలీసులు గన్నులతో చైతన్యను ఎయిమ్ చేసి ఉన్నారు. మరికొందరేమో చైత్యని కదలకుండా పట్టుకుని ఉన్నారు. అలాగే ఆ పోస్టర్ మీద.. 'ప్రపంచం మార్చాలి అనుకుంటే.. నువ్వు మారాలి' అని రాసి ఉంది. ఇదంతా చూస్తుంటే తన చుట్టుపక్కల ఉన్న సమాజాన్ని మార్చేందుకు ప్రయత్నించే ఓ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా చైతన్య నటిస్తున్నట్లు అర్థం అవుతోంది. కాగా.. ఈ సినిమాలో చైతన్యకి జోడీగా కృతి శెట్టి నటిస్తుండగా.. ప్రియమణి, శరత్ కుమార్, అరవిందస్వామి, ప్రేమ్ జీ, వెన్నెల కిషోర్, సంపత్ రామ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

డిసెంబరు 26న సంతోషం ఫిలిం అవార్డ్స్-2022

హైదరాబాద్: తెలుగు చలన చిత్ర పరిశ్రమకు అందచేస్తున్న అనేక అవార్డులలో "సంతోషం అవార్డ్స్" ఒకటి. దాదాపు రెండు దశాబ్దాలుగా ఈ అవార్డుల కార్యక్రమం ఘనంగా జరుగుతోంది. ఈసారి కూడా అదే విధంగా సంతోషం పత్రిక అధినేత, నిర్మాత సురేష్ కొండేటి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. తెలుగు సినిమా పరిశ్రమలో సురేశ్ కొండేటి అంటే తలలో నాలుకలా ఉంటాడన్న పేరు ఉంది. సాధారణ స్థాయి నుంచి ఓ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్, సంతోషం పత్రిక అధినేత, నటుడు ఇలా పలు రంగాల్లో తనదైన ముద్ర వేసిన వ్యక్తి. అసలు అవార్డులు కార్యక్రమం ప్రారంభించడానికి కారణం హీరో నాగార్జున అని సురేశ్ చెబుతూ ఉంటారు. సంతోషం మ్యాగజైన్ ఓపెనింగ్ రోజే అవార్డులు కూడా ప్రదానం చేస్తే బాగుంటుందని ఆయన సలహా ఇవ్వడంతో ఇదంతా చేయగలిగానని ఆయన పలు సందర్భాల్లో పేర్కొన్నారు. తర్వాత చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ తనను ఎంతో ప్రోత్సహించారని అంటూ ఉంటారు. ఇక అలా తెలుగు సినిమాలకు 20 ఏళ్లుగా అవార్డులు అందిస్తున్న 'సంతోషం' వారపత్రిక అధ్వర్యంలో 21వ సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డ్స్ 2022 వేడుకలు డిసెంబర్ నెల 26న హైదరాబాద్‌లో గ్రాండ్ గా జరగనున్నాయి. జేఆర్సీ కన్వెన్షన్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు ఈ వేడుకలు ప్రారంభమవుతాయి. సౌత్ ఇండియాలోని నాలుగు భాషల సినిమాలకు అవార్డులు అందిస్తూ వస్తున్నారు. డిసెంబర్ 26న జరగబోయే ఈ అవార్డు వేడుకల్లో తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ భాషల సినిమాలకు అవార్డులు అందచేయనున్నారు. ఇక ఈ కార్యక్రమం మూడున్నర గంటలకు ప్రారంభమై పన్నెండు గంటల పాటు సాగనుంది, 12 గంటలపాటు నాన్ స్టాప్ ఎంటర్టైన్మెంట్ అందించనున్నారు. ఈసారి అంతర్జాతీయ స్థాయిలో గ్రాండ్‌గా జరగనున్న ఈ వేడుకల్లో అనేకమంది తారల డ్యాన్స్, కామెడీ, హంగామాతో ఫుల్ ఫన్ అండ్ ఎంటర్టైన్మెంట్ గా ఉండబోతోందని సురేశ్ వెల్లడించారు.

విశ్వనాథ్‌ను కలిసిన కమల్

హైదరబాద్: ఏ పాత్రను అయినా అలవోకగా పోషించే నటుడు కమల్‌హాసన్. అభిమానులందరు విశ్వ నాయకుడు అని పిలుస్తుంటారు. కమల్ ప్రస్తుతం బిజినెస్ పని మీద హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా తెలుగు ఇండస్ట్రీకి అపురూప చిత్రాలను అందించిన లెజెండరీ డైరెక్టర్ కె. విశ్వనాథ్‌ను కలుసుకున్నారు. కళా తపస్వి నుంచి దీవెనలు తీసుకున్నారు. అందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కమల్, విశ్వనాథ్ అభిమానులందరు ఈ పిక్స్‌ను షేర్ చేసుకుంటూ తమ సంతోషాన్ని పంచుకుంటున్నారు. కమల్, విశ్వనాథ్ కలసి గతంలో 'సాగర సంగమం', 'స్వాతి ముత్యం', 'శుభ సంకల్పం' వంటి క్లాసిక్ సినిమాలకు పనిచేశారు. కమల్ హాసన్ తాజాగా 'విక్రమ్'లో నటించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది

రాజ్యాంగ రక్షణ ప్రజల కర్తవ్యం

లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక పిలుపు

డిసెంబరు 6 సదస్సు జయప్రదానికి కార్యాచరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: లౌకిక రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన కర్తవ్యం ప్రజల ముందున్నదని లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక పిలుపునిచ్చింది. రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతూ దేశాన్ని కాషాయీకరణ చేయాలని చూస్తున్న బీజేపీ చర్యలను ఎండగడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేలా విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది. వేదిక అధ్వర్యాన విజయవాడ ఎంబీ భవన్‌లో బాబ్రీ మసీదు కూల్చివేత దుర్దినమైన డిసెంబరు 6వ తేదీన 'లౌకిక రాజ్యాంగ పరిరక్షణ దినం' సదస్సు జరగనుంది. దీనిని జయప్రదం చేయడానికి విజయవాడ దాసరిభవన్‌లో బుధవారం ప్రజా సంఘాలు సన్నాహక సమావేశాన్ని నిర్వహించాయి. సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక చైర్మన్ జల్లి విల్సన్ అధ్యక్షత వహించారు. బాబ్రీ మసీదు విధ్వంసం జరిగిన డిసెంబరు 6వ తేదీని మత సామరస్యానికి గొడ్డలిపెట్టుగా పేర్కొంటూ ప్రజాస్వామ్య శక్తులు 'బ్లాక్‌డే'గా అభివర్ణించాయని సమావేశం గుర్తుచేసింది. మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్‌తోపాటు లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ మౌలానాముస్తాక్ అహ్మద్, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ప్రతినిధులు మాట్లాడుతూ... పౌరుల్లో అభద్రతా భావాన్ని కలిగించేందుకు కేంద్ర పాలకులు కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. సీఏఏ, ఎన్‌పీఆర్‌లను మళ్లీ తెరపైకి తెరపైకి తెచ్చి ఎన్నికల్లో లబ్ధి పొందడానికి రిజర్వేషన్లు, దళిత సమస్యల్ని వివాదం చేసి రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు ఈ ప్రమాదాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. నవంబరు 26 తేదీన భారత రాజ్యాంగ దినోత్సవాన్ని లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక అధ్వర్యంలో నిర్వహించాలని కూడా సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశానికి హైకోర్టు ప్రముఖ న్యాయవాది మతిన్, మైనార్టీ ఉద్యమనేత ఎస్కే షఫీ, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప, ఇన్సాఫ్ రాష్ట్ర కన్వీనర్ అఫ్సర్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, అవాజ్ రాష్ట్ర నాయకుడు ఎస్కే చిస్తి, కేవీపీఎస్ నాయకుడు శ్రీనివాస్, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ముజిఫర్ అహ్మద్ తదితరులు హాజరయ్యారు.

అలాంటివి పట్టించుకోను: హార్దిక్

న్యూఢిల్లీ: న్యూజిలాండ్‌తో టీ20 మ్యాచుల్లో తుది జట్టులోకి ఉమ్రాన్ మాలిక్, సంజూ శాంసన్ వంటి ఆటగాళ్లను తీసుకోకపోవడంపై టీమ్ మేనేజ్ మెంట్, కెప్టెన్‌ను లక్ష్యంగా చేసుకుని అనేకమంది విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ అంశంపై కెప్టెన్ హార్దిక్ పాండ్యా స్పందించాడు. పొట్టి సిరీస్‌లో ఆటగాళ్లను మార్చడం వల్ల ప్రయోజనం ఉంటుం దని తాను అనుకోవడం లేదని తెలిపాడు. ఇలాంటి విమర్శలు తనను బాధించ వన్నాడు. 'ఇది నా జట్టు. జట్టుకు సరిపోయే ఆటగాళ్లను కోచ్‌తో కలిసి నేను ఎంపికచేసుకుంటాను. ఇంకా చాలా సమయం ఉంది. ప్రతి ఒక్కరికీ అవకాశం ఉంటుంది. ఒకసారి జట్టులోకి వస్తే వారు ఎక్కువ కాలం పాటు కొనసాగుతారు. ఇక దీని గురించి బయట నుంచి వచ్చే విమర్శలను నేను పట్టించుకోను. ఒకవేళ ఇది ఎక్కువ మ్యాచ్‌లు ఆడే సుదీర్ఘ సిరీస్ అయితే.. కచ్చితంగా అందరినీ ఆడిస్తాం. అంతేకానీ జట్టును మధ్యలో విభజించి మార్పులు చేయడం సరైందని నేను నమ్మను. భవిష్యత్తులో కూడా నా పద్ధతి ఇలాగే ఉంటుంది" అంటూ హార్దిక్ వివరించాడు. అదే సమయంలో సంజూ శాంసన్ అంశంపైకూడా స్పందించాడు. 'ఉదాహరణకు సంజూనే తీసుకోం డి.. మేం అతడిని జట్టులోకి తీసుకోవాలనుకున్నాం. కానీ కొన్ని కారణాల వల్ల అది కుదరలేదు. నేను వారి స్థానంలో ఉండి ఆలోచించగలను. టీమిండి యాలో కొనసాగుతూ 11 మంది ఆటగాళ్లలో ఒకరిగా లేకపోవడం ఎంత బాధ కలిగిస్తుందో నాకు తెలుసు. కానీ నేను కెప్టెన్‌గా ఉంటే మాత్రం ఆ పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నం చేస్తాను. వారు నాతో, కోచ్‌తో మాట్లాడితే నేను వారికి సర్దిచెప్పగలను. ఎందుకంటే నాది జట్టును కలిసికట్టుగా ఉంచగలిగే స్వభావం" అంటూ పాండ్యా వివరించాడు.

సౌదీలో దేశవ్యాప్త సెలవు

ఫుట్‌బాల్‌లో అర్జెంటీనాపై సౌదీ అరేబియా గెలుపు.. సౌదీ రాజు సంచలన నిర్ణయం

రియాద్: ఫిఫా ప్రపంచకప్‌లో అర్జెంటీనాపై సంచలన విజయం నమోదు చేసిన సౌదీ అరేబియా జట్టు సంబరాల్లో మునిగితేలుతోంది. టు అధికారులు వాయిదా వేయనున్నారు. ప్రజలు ఆహ్లాదంగా గడిపేందుకు స్థానిక అధికారులు ఏర్పాట్లు చేశారు. బుధవారం నగరంలోని అన్ని థీమ్ పార్కులు, వినోద కేంద్రాల్లో ప్రవేశ రుసుం లేకుండానే అనుమతులు ఇవ్వనున్నట్లు సౌదీ అరేబియా జనరల్ ఎంటర్‌టైన్‌మెంట్ అథారిటీ అధిపతి టర్కీ అల్ షేక్ ట్విటర్‌లో వెల్లడించారు. గ్రూప్-సిలో అత్యంత బలహీనమైన జట్టుగా ఉన్న సౌదీ.. టైటిల్ ఫేవరెట్ అయిన అర్జెంటీనాను ఓడించి చరిత్ర సృష్టించింది. సౌదీ ఆటగాళ్లు, అభిమానుల కేరింతలతో స్టేడియం హోరెత్తిపోయింది. దేశ రాజధాని రియాద్‌లోనూ సంబరాలు మిన్నంటాయి. రహదార్లపై ప్రయాణికులు జాతీయ జెండాలతో సందడి చేశారు.

యువరాజ్‌కు గోవా టూరిజం నోటీసులు

పనాజీ: టీమిండియా స్టార్ మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ వివాదంలో చిక్కుకున్నాడు. గోవా పర్యాటక శాఖ నోటీసులు జారీ చేసింది. అధికారుల నుంచి అనుమతి లేకుండానే మోర్జిమ్‌లోని తన విల్లాను గెస్టుల కోసం అద్దెకు ఇవ్వనున్నట్లు ఆన్‌లైన్‌లో పెట్టడంపై నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. గోవా రిజిస్ట్రేషన్ ఆఫ్ టూరిస్ట్ ట్రేడ్ యాక్ట్ 1982 ప్రకారం.. గోవాలో హోమ్‌స్టే (పెయింగ్‌గెస్ట్) ఇవ్వాలంటే తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. నవంబర్ 18న ఉత్తర గోవాలోని మోర్జిమ్ ప్రాంతంలోని 'కాసా సింగ్' పేరిట ఉన్న యువరాజ్ విల్లా అడ్రెస్‌కు టూరిజం శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్ కాలే పేరిట నోటీసు జారీ అయింది. డిసెంబర్ 8న ఉదయం 11 గంటలకు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని అందులో అధికారులు పేర్కొన్నారు. టూరిజం యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోకుండా ఉన్నందున జరిమానా (రూ. లక్ష వరకు) ఎందుకు విధించకూడదో చెప్పాలని ప్రశ్నించారు. ప్రతి వ్యక్తి హోటల్/గెస్ట్ హౌస్ కార్యకలాపాలు నిర్వహించాలంటే కచ్చితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందేనని గోవా టూరిజం శాఖ స్పష్టం చేసింది. అలాగే గతంలో యువరాజ్ సింగ్ చేసిన ట్వీట్‌ను కూడా నోటీస్‌లో పేర్కొనడం విశేషం.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.